# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 235 | విశాఖపట్నం | 26-5-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 235 | VISAKHAPATNAM | 26-5-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM UPI yono SBI BHIM SBI Pay G Pay Paytm Pay





2లో

మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

కుంటుపడిన నీటి నిల్వలు..!



5లో



6లో

రాత్రి నిద్రపోయినా, పగటిపూట అలసిపోతున్నారా?

### ఆంధ్రప్రదేశ్‌ని జెట్ స్పీడ్‌తో

# అభివృద్ధి చేస్తాం: చంద్రబాబు




**అమరావతి, పతాకం న్యూస్:** టెక్నాలజీని అనుసంధానం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మెటా, అమెజాన్, జోహో వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందని, యువతకు అపార అవకాశాలు సృష్టిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సోమవారం విజయవాడలో జరిగిన 'ఎంఎస్‌ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీపై ఆధారపడి ఉందని, దీన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా మారుస్తామని, క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తిని కూడా ఇక్కడే చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. యువత, విద్యాసంస్థలు ఈ నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు.

రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తున్నామని, విశాఖపట్నాన్ని ప్రపంచానికే డేటా సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. స్టీల్, అల్యూమినియం, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి కీలక పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. పుట్టపర్తి నుంచి బెంగళూరు వరకు డిఫెన్స్ కారిడార్‌గా, రాయలసీమను రూ.40 వేల కోట్ల పెట్టుబడితో ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఐదో తరం ఫైటర్ జెట్ యుద్ధ విమానాల టెస్టింగ్ ఫెసిలిటీని రాయలసీమలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సూర్యలంక, గండికోట వంటి పర్యాటక ప్రాంతాలను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన 'చిప్ టు షిప్' పిలుపునకు అనుగుణంగా రాష్ట్రంలో మాన్యుఫ్యాక్చరింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు. కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, పరిశ్రమలు వాస్తవ రూపంలో కార్యకలాపాలు ప్రారంభించేలా చూస్తున్నామని, 'సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్' తమ ప్రభుత్వ విధానమని పునరుద్ఘాటించారు. (తరువాయి 2వ పేజీలో)



## గ్రానైట్ లారీలతో

# పొంచి వున్న ముప్పు!

- ఛిద్రమవుతున్న రహదారులు
- వంతెనలు, కల్వర్టులు కూలిపోయే ప్రమాదం
- పట్టించుకోని ఆర్అండ్‌బీ, రవాణాశాఖ అధికారులు

**చోడవరం, పతాకం న్యూస్:** భారీ గ్రానైట్ శిలలు తరలించే ట్రాలర్ లారీలతో చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని పలు రహదారులు, వంతెనలకు ముప్పు పొంచివుంది. ముఖ్యంగా బీఎన్ రోడ్డులో శిథిలావస్థకు చేరిన కల్వర్టులు, వంతెనలు కూలిపోతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వంతెన సామర్థ్యంకన్నా రెట్టింపు బరువుతో గ్రానైట్ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ఆర్అండ్‌బీ, పోలీసు, రవాణా శాఖల అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నిస్తున్నారు. చోడవరం నియోజకవర్గం రావికమతం, మాడుగుల నియోజకవర్గం మాడుగుల మండలంలో పది నుంచి పదిహేను వరకు గ్రానైట్ క్వారీలు వున్నాయి. వీటి నుంచి భారీ గ్రానైట్ శిలలను విశాఖ, చెన్నైలకు తరలిస్తుంటారు. ట్రాలర్ల సామర్థ్యాన్నిబట్టి (టైర్లు) ఒక్కో వాహనంపై రెండు నుంచి నాలుగు వరకు శిలలను రవాణా చేస్తారు. ఆయా క్వారీల నుంచి గ్రానైట్ రాళ్లను రావికమతం, మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం, అనకాపల్లి మండలాల మీదుగా జాతీయ రహదారికి చేరుకొని గమ్యస్థానాలకు తరలిస్తుంటారు. ఒక్కో లారీపై వంద టన్నులకు పైబడి గ్రానైట్ శిలలను రవాణణ చేస్తున్నారు. దీంతో ఆయా రహదారులు.. ముఖ్యంగా బీఎన్ రోడ్డు ఛిద్రం అవుతున్నాయి. ఈ మార్గాల్లో పలుచోట్ల వున్న కల్వర్టులు, వంతెనలు శిథిలావస్థకు చేరడంతో గ్రానైట్ తరలించే ట్రాలర్ లారీలతో ముప్పు పొంచివుంది. గ్రానైట్ శిలలను తరలించే వాహనాల కారణంగానే వడ్డాది, విజయరామరాజుపేటల వద్ద వంతెనలు కూలిపోయాయి. ఇంతవరకు (తరువాయి 2వ పేజీలో)

## పెట్రో ధరలు పెంచడంపై మోడీపై రాహుల్‌గాంధీ ఆగ్రహం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను విడతల వారీగా పెంచుతూ ప్రజలపై పెనుభారం మోపుతున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆయన ఓ పోస్టు పెట్టారు. ప్రధాని మోదీని ఉద్దేశించి 'ద్రవ్యోల్బణ సూత్రధారి' అంటూ విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలను నెమ్మదిగా పెంచుతూ ప్రజల జేబులను నిశ్శబ్దంగా ఖాళీ చేస్తున్నారని ఆరోపించారు.




## బరితెగించిన..

# విశాఖ గ్యాస్ ఏజెన్సీ

- జన నివాసాల మధ్య గ్యాస్ పంపిణీ
- లారీ.. లారీలతో గ్యాస్ గొడౌన్‌గా మార్చేసిన కైలాసపురం రోడ్డు
- పౌరసరఫరాలశాఖ అధికారులు ఎక్కడ ఉన్నారు?
- హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ ఎక్కడ నిద్ర పోతున్నారు ?
- ఒకవేళ పొరపాటున గ్యాస్ సిలిండర్ పేలితే ఎవరు బాధ్యులు ?
- సామాన్యులు పౌరులు చనిపోతే డబ్బులు ఇస్తామని చెప్పే ఈ రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ముందుగా తేరుకోవా?
- కాసులకు కక్కుర్తి పడి లంచాలకి మంచాలు ఎక్కుతున్న అధికారులు !!!
- నిబంధనలను గాలికి వదిలేసిన విశాఖ గ్యాస్ ఏజెన్సీ
- ఎవరైనా చనిపోతే బాధ్యులెవరో?
- నిజాలు నిగ్గుతేల్చాలంటున్న ఆర్టీఐ కార్యకర్తలు
- ప్రభుత్వాలు ఇప్పటికైనా పట్టించుకోని గ్యాస్ ఏజెన్సీ పై చర్యలు తీసుకొని.. మూయించండి

## గోదావరి పుష్కర ఘాట్ల పనులను

# పరిశీలించిన పవన్



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజమండ్రిలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గోదావరి నదిలో పుష్కర ఘాట్ల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల గురించి పవన్‌కు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి వివరించారు. అనంతరం పుష్కర్ ఘాట్ నుంచి కోటిలింగాల రేవు వరకు పవన్ బోటులో ప్రయాణం చేశారు. అఖండ గోదావరి ప్రాజెక్టు పనులను పవన్‌కు మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. గోదావరిలో కాలుష్య నివారణకు ఘాట్ల వెంట తీసుకోవాల్సిన చర్యలను పవన్ పరిశీలించారు. 'గోదావరి నదిలోకి కలిసే కాలుష్యకారక వ్యర్థాలు, జలాలు, వాటి నిర్వహణపై పూర్తిస్థాయి ఆడిట్ చేపట్టి నివేదిక ఇవ్వండి. ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి..? భవిష్యత్తులో చేయబోయే పనుల మీద స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేయండి' పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉన్నత అధికారులు, తూర్పు గోదావరి జిల్లా అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను 'కాలుష్యరహిత గోదావరి' థీమ్ తో సాకారం చేసి నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం పుష్కరాల ఘాట్ నుంచి కోటిలింగాలు ఘాట్ వరకు (తరువాయి 2వ పేజీలో)

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## హక్కులు..

పితృస్వామ్య సమాజంలో శతాబ్దాలుగా మహిళల పాత్రను కేవలం వంటింటికీ, పిల్లల్ని కనడానికే పరిమితం చేస్తూ వచ్చారు. మహిళల పునరుత్పత్తి హక్కులు, పితృస్వామ్య సమాజంలో గర్భంపై, స్వేచ్ఛపై జరిగే రాజకీయాలను తట్టుకుని, పోరాడుతూనే వున్నారు. అంతరిక్ష పరిశోధనల నుండి దేశ రక్షణ రంగం వరకు మహిళలు తమ సత్తా చాటుతూనే వున్నారు. జనాభా సమతుల్యత పేరిట మహిళల గర్భాన్ని ఒక సాధనంగా మార్చాలనుకోవడం కొత్త ఆలోచనేమీ కాదు. శతాబ్దాలుగా పితృస్వామ్య సమాజం, వ్యవస్థలు స్త్రీ శరీరాన్ని, ఆమె పునరుత్పత్తి శక్తినీ తమ ఆధీనంలో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాయి. 'సమాజం, కుటుంబం కలిసి ఒక స్త్రీ గర్భాన్ని ఎలా నియంత్రిస్తాయో, ఆమె ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా సంతానం కోసం ఎలా ఒత్తిడి తెస్తాయో 'గర్భగుడి- కథలో చిత్రిస్తారు రచయిత్రి పి.సత్యవతి. 'స్త్రీ శరీరం కేవలం వంశాన్ని ఉద్ధరించే 'గుడి' కాదు, అది ఆమె ప్రాణమని- చాటిచెపుతారు. 'జనాభా క్షీణించిపోతున్న ఒక ఊహాజనిత సమాజంలో, పాలకులు అధికారాన్ని చేజిక్కించుకుని, పిల్లల్ని కనగలిగే సత్తా ఉన్న మహిళలను కేవలం 'సంతానోత్పత్తి యంత్రాలు (హ్యాండ్ మెయిడ్స్)- గా మార్చేస్తారు. వారికి చదువుకునే హక్కు, ఉద్యోగం చేసే హక్కు, కనీసం సొంతగా పేరు పెట్టుకునే హక్కు కూడా ఉండని ఒక సందర్భాన్ని 'హ్యాండ్ మెయిడ్స్ టేల్- అనే నవలలో మార్గరెట్ అట్‌వుడ్ చిత్రిస్తారు. ఇదే నవలలో 'నా శరీరం నా ఆధీనంలో లేనప్పుడు, నేను స్వతంత్రురాలినని ఎలా చెప్పుకోగలను?- అంటారు రచయిత్రి. తాజాగా ఇలాంటి సందర్భమే ఆంధ్రప్రదేశ్ మహిళలకూ ఎదురైంది. 'మహిళలు సృష్టికర్తలు, పిల్లల్ని భారంగా భావించొద్దు. పిల్లలే మన సంపద. ఎంత మందికి వీలైతే అంతమందిని కనండి. మూడో బిడ్డ పుట్టిన వెంటనే రూ.30 వేలు, నాలుగో బిడ్డ పుడితే...రూ.40 వేలు పురిటి మంచంపైనే అందజేస్తాం- అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్త నినాదం అందుకున్నారు. ఉన్న ఒకరిద్దరు పిల్లల పోషణకే అష్టకష్టాలు పడుతుంటే... ముగ్గురు, నలుగురిని కనాలని ముఖ్యమంత్రి పిలుపునివ్వడం విస్తుగొలుపుతోంది. ఒకప్పుడు కుటుంబ నియంత్రణకు కృషి చేశామని, ఇప్పుడు పరిస్థితులు మారినందున ఎక్కువ మంది పిల్లలను కనాలని.. పిల్లల బాగోగులు తానే చూస్తానని చెప్పడం నిజంగానే విడ్డూరం. కుటుంబంలో పిల్లల సంఖ్య పెరిగితే వారికి సరైన పోషకాహారం, నాణ్యమైన విద్య, వైద్యం అందించడం తల్లిదండ్రులకు తలకు మించిన భారం అవుతుందని, ప్రతి ప్రసవం తల్లికి పునర్జన్మ అన్న విషయం తెలియనట్లే నటించడం పట్ల నిపుణులు ఆందోళన వెలిబుచ్చారు. ఒక కుటుంబంలో చదువుకునే పిల్లలు ఎంతమంది వున్నా... వారందరికీ ప్రతి ఏడాది తలో రూ.15 వేలు ఇస్తామని సూపర్ సిక్స్ లో చెప్పినది రెండేళ్లవుతున్నా... అమలు అంతంత మాత్రంగా వుంది. ఇప్పుడు మాత్రం ఆదాయం పెరుగుతోంది, జనాభా తగ్గుతోందంటూ కొత్త పల్లవి అందుకున్నారు. దీనిపై మహిళా సంఘాలు, అభ్యుదయవాదులు మండిపడుతున్నారు. 'మహిళల జీవితం కేవలం పిల్లల కోసమేనా? వారి ఉద్యోగాలు, కలల మాటేమిటి? పిల్లల్ని కనడం అనేది పూర్తిగా మహిళల సొంత నిర్ణయం. వారి వ్యక్తిగత విషయాలను ప్రభుత్వాలు ఎలా నిర్ణయిస్తాయి? తల్లి గర్భంపై కూడా రాజకీయమా?- అంటూ భారత మొదటి ఐపిఎస్ అధికారిణి కిరణ్ బేడీ, ఐద్వా సీనియర్ నేత బృందాకరత్ వంటి వారు అనేక మంది పలు ప్రశ్నలు సంధిస్తున్నారు. ప్రభుత్వాలు చేయాల్సింది జనాభాను పెంచమని పిలుపులు ఇవ్వడం కాదు; ఉన్న జనాభాకు ఉపాధి కల్పించడం, మహిళలకు భద్రతను పెంచడం, వారి చదువులకు, ఉద్యోగాలకు భరోసానివ్వడం. మహిళ సాధికారత సాధించినప్పుడే నిజమైన సమాజ వికాసం సాధ్యమవుతుంది. 'స్త్రీ తన శరీరంపై, తన ప్రాణంపై పూర్తి హక్కును కలిగి ఉండనంత కాలం ఈ సమాజానికి స్వేచ్ఛ గురించి మాట్లాడే అర్హత లేదు- అంటాడు చలం 'మైదానం' నవలలో. బిజెపికి ఊతమివ్వాలనో, రాజకీయ ప్రయోజనాల కోసమో... గర్భగుడి వంటి మహిళల గర్భాన్ని అస్త్రంగా వాడుకోవాలనుకునే కుటిలనీతిని సాగనివ్వకూడదు. 'స్త్రీ శరీరం ఒక ప్రయోగశాల కాదు, పాలకుల జనాభా లెక్కలను సరిచేసే వేదిక అసలే కాదు.' చైతన్యంతోనే మహిళలు తమ హక్కుల కోసం, స్వేచ్ఛ కోసం గళం విప్పాల్సిన అవసరం ఉంది.

## రెండు వారాల్లో నాలుగోసారి.. మళ్లీ పెరిగిన పెట్రో ధరలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా ఇంధన ధరలు మరోసారి భారీగా పెరిగాయి. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు సోమవారం పెట్రోల్, డీజిల్ ధరలను సవరించాయి. తాజా పెంపుతో ఢిల్లీలో లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెరిగింది. గత రెండు వారాల్లో ఇంధన ధరలు పెరగడం ఇది నాలుగోసారి. ఈ పెరుగుదలతో దేశ రాజధానిలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12కు, డీజిల్ ధర రూ.95.20కు చేరింది. పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లు దాటాయి. కీలకమైన హర్మూజ్ జలసంధి మీదుగా రవాణాకు అంతరాయం కలగడంతో చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. ఈ నష్టాలను పూడ్చుకునేందుకే చమురు సంస్థలు ధరలను పెంచక తప్పడం లేదని తెలుస్తోంది. ఈ పెంపునకు ముందు, సుమారు 76 రోజుల పాటు ధరలను స్థిరంగా ఉంచడం వల్ల చమురు కంపెనీలు రోజుకు దాదాపు రూ.1,000 కోట్ల నష్టాన్ని చవిచూశాయని అంచనా. ఈ పరిణామాలపై ఓఎన్‌జీసీ డైరెక్టర్ (ఎక్స్‌ప్లోరేషన్) సుష్మా రావత్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి కారణంగా ముడి చమురు ధరలు తీవ్రంగా హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయని తెలిపారు. "ప్రభుత్వం 76 రోజుల పాటు ధరలు పెంచకుండా ప్రజలకు ఉపశమనం ఇచ్చింది. కానీ కంపెనీలకు ఇంత భారీ నష్టం వస్తుంటే ఎంతకాలం భరించగలరు?" అని ఆమె ప్రశ్నించారు. తాజా పెంపుతో ఇప్పటికే ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలపై మరింత భారం పడనుంది. ముఖ్యంగా డీజిల్ ధరల పెరుగుదల రవాణా ఖర్చులను పెంచుతుంది. ఇది నిత్యావసర వస్తువుల ధరలపై నేరుగా ప్రభావం చూపుతుంది.

## లారీని ఢీకొట్టిన మరో లారీ.. డ్రైవర్ సజీవ దహనం



**పెనుకొండ, పతాకం న్యూస్:** లారీని మరో లారీ ఢీకొట్టడంతో డ్రైవర్ సజీవదహనమైన ఘటన సోమవారం తెల్లవారుజామున శ్రీ సత్యసాయి జిల్లాలో జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని పులేకమ్మ గుడి వద్ద ఘోర ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున రోడ్డుపై ఆగి ఉన్న బంగాళదుంపల లారీని, గోధుమల లోడుతో వస్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టింది. మంటలు భారీగా చెలరేగడంతో గోధుమల లారీ దగ్ధమైంది. క్యాబిన్లో ఇరుక్కుపోయిన డ్రైవర్ కిరణ్ అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతుడు ఆదిలాబాద్ జిల్లా వాసిగా గుర్తించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కేంద్రప్రభుత్వం సహకరించకపోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం: రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** కేంద్రప్రభుత్వం సహకరించకపోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సీపీఐ బృందం సోమవారం సచివాలయంలో సమావేశం అయ్యారు. సీఎంని కలిసిన వారిలో సీపీఐ ఎమ్మెల్సీ సత్యం, పశ్య పద్మ , ఈ.నరసింహ, చాడ వెంకట్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే భాగం హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీఎస్ బోసు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు. కార్మికులకు కనీస వేతనాల పెంపుపై ముఖ్యమంత్రికి సీపీఐ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎంతో సీపీఐ నేతలు చర్చించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులతో సీఎం మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లు చేయడం లేదని తెలిపారు. తమ ప్రభుత్వానికి నష్టం వచ్చినా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు.. ఫ్రాన్స్‌కు లేఖ సిద్ధం చేసిన భారత్!

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత వైమానిక దళాన్ని మరింత శక్తిమంతం చేసే దిశగా రక్షణ శాఖ కీలక ముందడుగు వేసింది. ఫ్రాన్స్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన అధికారిక ప్రతిపాదన లేఖను కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. రాబోయే కొన్నిరోజుల్లోనే దీన్ని ఫ్రాన్స్ ప్రభుత్వానికి పంపించనున్నట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ భారీ రక్షణ ఒప్పందంలో భాగంగా దాదాపు 90 యుద్ధ విమానాలను 'మేకిన్ ఇండియా' కింద ఇక్కడే తయారు చేయనున్నారు. ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్, ఓ భారతీయ భాగస్వామ్య సంస్థతో కలిసి వీటిని మనదేశంలోనే ఉత్పత్తి చేస్తుంది. మిగిలిన విమానాలను మాత్రం నేరుగా ఫ్రాన్స్ నుంచి ఎగిరివచ్చే (ఫ్లై-అవే) స్థితిలో దిగుమతి చేసుకుంటారు. మన లేఖకు ఫ్రాన్స్ స్పందించిన తర్వాత అధికారికంగా టెండర్ ప్రక్రియ ముందుకు సాగుతుంది. భారతదేశ రక్షణ అవసరాలకు సరిపోయేలా ఈ రఫేల్ విమానాల్లో కనీసం 50 శాతం మేర స్వదేశీ సాంకేతికత, విడిభాగాలనే ఉపయోగించాలని ఢిల్లీ గట్టిగా పట్టుబడుతోంది.

## ఇంధన ధరల పెంపు.. ట్యాక్స్ తగ్గిస్తే రూ.1 లక్ష కోట్ల నష్టం: నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తే ప్రభుత్వం దాదాపు రూ.లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావులేదని స్పష్టం చేశారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే. పశ్చిమాసియా సంక్షోభం మొదలై మూడు నెలలు కావస్తున్న తరుణంలో ప్రభుత్వం '3-ఎఫ్' (ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫారెక్స్ - ఇంధనం, ఎరువులు, విదేశీ మారకం)పై ప్రత్యేక దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల ఎరువుల ధరలు ఊహించని స్థాయికి చేరాయని, బంగారం ధరలు పెరగడం కూడా సవాలుగా మారిందని చెప్పారు. బయటి సంక్షోభాలను తట్టుకునేలా మోదీ నేతృత్వంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత సవాళ్లు అన్నీ అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వచ్చినవేనని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను మరిచిపోయి, కేవలం నెగటివిటీని ప్రచారం చేయడం సరికాదన్నారు. మన దేశం ఇలాంటి భయానక ప్రచారాలను భరించలేదని, మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

(మొదటిపేజీ తరువాయి)

## అభివృద్ధి చేస్తాం: చంద్రబాబు

గత 23 నెలల్లో నెలకు రూ.లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామని ఆయన వెల్లడించారు. ఎంఎస్ఎంఈ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. వ్యవసాయం తర్వాత అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ పాలసీతో పాటు ప్రైవేట్ పారిశ్రామిక పార్కుల పాలసీలను తీసుకొచ్చామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇప్పటికే 100 పార్కులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఈ ఏడాది 5 లక్షల మంది డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తామని ప్రకటించారు. రాష్ట్రం నుంచి 100 యునికార్న్ సంస్థలను ఏర్పాటు చేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు, విజయవాడలో 4.4 ఎకరాల విస్తీర్ణంలో 1.45 లక్షల చదరపు అడుగుల స్థలంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కళావేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇలాంటి మరో ఐదు కన్వెన్షన్ సెంటర్లను నిర్మిస్తామని ఈ వేదికగా సీఎం హామీ ఇచ్చారు.

## పొంచి వున్న ముప్పు!

ఆయా ప్రదేశాల్లో కొత్త వంతెనలు నిర్మించలేదు. తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టుల మీదుగా వాహనాలు నడుస్తున్నాయి. ఈ మార్గంలో పాత వాటిల్లో మిగిలింది గోవాడ వద్ద శారదా నదిపై ఉన్న వంతెన. గ్రానైట్ రవాణా వాహనాలు ఈ వంతెన మీదుగా వెళుతున్నప్పుడు ప్రకంపనలు వస్తున్నాయని పలువురు వాహనదారులు చెబుతున్నారు. చోడవరం- వెంకన్నపాలెం మధ్య రెండు శి?థిల కల్వర్టులు వున్నాయి. గ్రానైట్ వాహనాల ధాటికి వీటికి ముప్పు వాటిల్లితే బీఎన్ రోడ్డులో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. గ్రానైట్ లారీల దూకుడుపై పత్రికల్లో కథనాలు వచ్చినా, ప్రజలు ఆందోళనలు చేసినా.. అధికారులు పట్టించుకోవడంలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రహదారులు ఇప్పుడిప్పుడే బాగుపడుతున్నాయని, గ్రానైట్ శిలలను రవాణా చేసే వాహనాలతో ఛిద్రమై పరిస్థితి మళ్లీ మొదటికొస్తుందని ఆయా మండలాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రానైట్ లారీల వల్ల రోడ్లు పాడైపోతుంటే ఆర్అండ్‌బీ, రవాణా, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని అంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి గ్రానైట్ లారీలను కట్టడి చేయకపోతే బీఎన్ రోడ్డు మరింత దారుణంగా తయారవుతుందని ఆందోళనే చెందుతున్నారు.

## పరిశీలించిన పవన్

పడవలో ప్రయాణించి గోదావరి జలాల కాలుష్యకారక ప్రాంతాలని పరిశీలించారు. పుష్కరాల్లో చేయాల్సిన పనుల తీరు, త్వరలో చేపట్టబోయే పనుల ప్రణాళికను స్వయంగా పరిశీలించారు. గోదావరి గట్ల సుందరీకరణ పనులు ఎంతవరకు వచ్చాయనేది, పుష్కరాల నేపథ్యంలో గట్లను ఎలా తీర్చిదిద్దబోతున్నది అధికారులు వివరించారు. ఈ సందర్భంగా చింతలమ్మ ఘాట్ వద్ద నల్లా ఛానల్ ద్వారా రాజమహేంద్రవరం మురుగునీరు గోదావరిలోకి కలిసే ప్రాంతాన్ని పవన్ స్వయంగా పరిశీలించారు. నది తీరంలో జరుగుతున్న కాలుష్యం తీరును స్వయంగా చూశారు. నీటిని ఎలా శుద్ధి చేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న సిబ్బందితో మాట్లాడి వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని చూశారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులకు ఆదేశాలిస్తూ "గోదావరిలోకి రోజువారీ సుమారుగా 55 ఎం. ఎల్. డి. (మిలియన్ లీటర్స్ పర్ డే) మురుగునీరు వస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ మురుగు నీటిని శుద్ధి చేసే విధానం శాస్త్రీయంగా జరగాలి. మురుగు నీటిని నేరుగా గోదావరిలోకి వదలడం వల్ల జలాలు కలుషితం అవుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై దృష్టి సారించాలి. గోదావరి పుష్కరాలకు ఖర్చు చేసే ప్రతి పైసాను ప్రజలకు ఉపయోగపడే, గోదావరి నది తీరాన్ని కాపాడే మంచి పనులకు ఉపయోగించుకోవాలి. మొదట కాలుష్యకారక అంశాలపై పూర్తిస్థాయి ఆడిట్ జరగాలి.. తర్వాత దానిని ఎలా అధిగమించాలి అనే అంశాల పట్ల దృష్టి సారించవచ్చు. కేవలం లెక్కలతో సరిపెట్టకుండా పూర్తి స్థాయి యాక్షన్ ప్లాన్ తో ముందుకు వెళ్దాం. కేంద్ర జల శక్తి ద్వారా ఎన్.ఆర్. సి. పి. నిధులు రూ. 416 కోట్లలో రూ. 95 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు వచ్చాయి. ఈ నిధులతో కొత్త ట్రీట్మెంట్ ప్లాంట్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాలని" పవన్ తెలియజేశారు.

# 'కాక్రోచ్ జనతా పార్టీ'పై స్పందించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా



**గాజువాక, పతాకం న్యూస్:** సోషల్ మీడియాలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న వ్యంగ్యాస్త్ర ఉద్యమం 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ)పై టీడీపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఉద్యమం యువతలో నెలకొన్న నిజమైన ఆకాంక్షలు, ముఖ్యంగా ఉద్యోగాల విషయంలో వారికున్న నిరాశకు అద్దం పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. దీన్ని కేవలం హాస్యంగా కొట్టిపారేయకుండా, విధాన రూపకర్తలు తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశంగా ఆయన పేర్కొన్నారు. యువత అంచనాలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని ఈ పరిణామం సూచిస్తోందని పల్లా అన్నారు. ఉద్యోగాల కల్పన, ఆర్థికాభివృద్ధి, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని ఆయన ప్రశంసించారు. అదే సమయంలో, ఆన్‌లైన్ వేదికలపై జరిగే చర్చల విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని, బాహ్య శక్తులు ఈ పరిస్థితిని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షంగా, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ పార్టీ కట్టుబడి ఉందని పల్లా స్పష్టం చేశారు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు సంబంధించినవిగా ప్రచారంలో ఉన్న కొన్ని వ్యాఖ్యల నేపథ్యంలో 'కాక్రోచ్ జనతా పార్టీ' అనే వ్యంగ్య ఉద్యమం సోషల్ మీడియాలో పుట్టుకొచ్చింది. కొందరు సోషల్ మీడియా యాక్టివిస్టులను ఉద్దేశించి ఆయన "బొద్దింకలు", "పరాన్నజీవులు" అని వ్యాఖ్యానించినట్లు వివాదం రేగింది. అయితే, ఆ వ్యాఖ్యలు నకిలీ న్యాయ పట్టాలు కలిగిన వారిని ఉద్దేశించినవని తర్వాత ఆయన స్పష్టత ఇచ్చారు. ఈ క్రమంలోనే, యువత ఈ పదాన్ని వ్యంగ్యంగా స్వీకరించి నిరుద్యోగం, పరీక్షల లీకులు, ఆర్థిక ఒత్తిళ్లు వంటి సమస్యలపై దృష్టి సారిస్తూ ఒక మోడల్ రాజకీయ పార్టీని సృష్టించారు. ఈ ఉద్యమం అనతికాలంలోనే ఆన్‌లైన్‌లో లక్షలాది మంది ఫాలోవర్లను సంపాదించుకోవడం గమనార్హం.

## ప్రభుత్వ పాఠశాలల్లో బోధన బాగోకపోతే 'ప్రైవేటు'కు వెళ్లండి: డీఈవో



**చోడవరం, పతాకం న్యూస్:** "మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి. రెండు నెలలపాటు మా ఉపాధ్యాయుల బోధనను పరిశీలించండి. చదువు బాగోలేదని అనిపిస్తే.. మీ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్పించుకోండి" అని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో చక్కటి బోధన జరుగుతుందన్న విషయం చాలామంది తల్లిదండ్రులకు తెలియక తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లల్లో చేర్పిస్తున్నారని అన్నారు అయితే ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలపై తాము నిర్వహిస్తున్న ప్రచారం వల్ల తల్లిదండ్రుల్లో మార్పు వస్తున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులు చక్కని బోధన అందిస్తున్న విషయంతోపాటు చిన్నారుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, సౌకర్యాలు, పథకాల గురించి వివరిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనను రెండు నెలలు గమనించాలని, బోధన బాగో లేదనిపిస్తే పిల్లలను మీకు నచ్చిన పాఠశాలలో చేర్పించుకోవచ్చని వివరిస్తున్నామని అన్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో చదివించిన తల్లిదండ్రులు, ఈ ఏడాది తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని చెబుతున్నారని అన్నారు. అయితే కొంతమంది తల్లిదండ్రులు.. గత ఏడాదికి సంబంధించి ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల బకాయిలు వున్నాయని చెప్పగా, ఆయా ప్రైవేటు స్కూళ్ల యజమానులతో తాము మాట్లాడతామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించామన్నారు. డీఈవో వెంట ఎంఈవోలు సింహాచలంనాయుడు, నీలకంఠం, బాలికల హైస్కూల్ హెచ్ ఎం ఐ.వి.రామిరెడ్డి, సీఆర్ పీ కేవీఎం నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ గుమ్మాల సత్తిబాబు, స్థానిక ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వున్నారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ, మామిడి పళ్లు పంపిణీ చేసిన వైసీపీ నాయకులు



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం నాగాయ్యపేట గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెరువు పనుల్లోకి వెళ్లిన ఉపాధి కూలీలకు వైఎస్ఆర్సీపీ పార్టీ ఆధ్వర్యంలో మజ్జిగ, మామిడి పళ్ళు పంచి దాహం తీర్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్టీ నేతలు సీనియర్ నాయకులు పాల్గొన్నారు... మిత్రపక్షమైన అధికారంలో ఉన్న పార్టీ చేయవలసిన పనులు ప్రతిపక్ష పార్టీ చేయవలసి పరిస్థితి వచ్చిందని నాగయ్యపేట గ్రామ ఎంపీటీసీ దుయ్యబట్టారు.

## త్వరలో కేజీహెచ్ అభివృద్ధి మండలి నియామకం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కింగ్ జార్జ్ ఆస్పత్రికి అభివృద్ధి మండలి (హెచ్‌డీఎస్) నియామక ప్రక్రియ ప్రారంభమైంది. పదిహేను మంది సభ్యులతో కూడిన జాబితాను ఆస్పత్రి అధికారులు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు పంపించారు. ఒకటి, రెండు రోజుల్లో ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన హెచ్‌డీఎస్ పదవీ కాలం ముగిసింది. ఏటా అభివృద్ధి మండలిని రెన్యువల్ చేస్తూ ఉండాలి. అయితే, రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కొత్త కమిటీని ఏర్పాటుచేయలేదు. దీంతో ఆస్పత్రి అధికారులు నూతన కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు కొత్త సభ్యులతో కూడిన జాబితాను కలెక్టర్ వద్దకు పంపించారు. హెచ్‌డీఎస్ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. కో-చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే వ్యవహరించనున్నారు. సభ్యులుగా ఎంపీ, డీఎంఈ, జీవీఎంసీ కమిషనర్, ఆస్పత్రి సూపరింటెండెంట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, డీఎంఅండ్‌హెచ్‌వో, డీసీహెచ్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈతోపాటు నామినేటెడ్ సభ్యులు మరో ఐదుగురు ఉంటారు. స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులకు అవకాశం కల్పిస్తారు.

## తారెత్తించిన ఎండలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. మాకవరపాలెంలో 45.5, కశింకోట 43.4, నాతవరం, నక్కపల్లి 43.3, గొలుగొండ 43.1, నర్సీపట్నం 43, ఎస్.రాయవరం 42.7, పాయకరావుపేట 42.2, కోటవురట్ల 42, బుచ్చెయ్యపేట 41.6, మునగపాక 41.3, దేవరాపల్లి 40.8, రావికమతం, రోలుగుంట, రాంబిల్లి 40.7, ఎలమంచిలి 40.2, కె.కోటపాడు 40, అనకాపల్లి, సబ్బవరం 39.5, మాడుగుల 39.3, చోడవరం 38.9, అచ్యుతాపురం 38.8, చీడీకాడలో 38.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## ఆర్.భీమవరంలో ఎంఎస్ఎంఈ పార్కు



**బుచ్చెయ్యపేట, పతాకం న్యూస్:** మండలంలోని ఆర్.భీమవరంలో ఏర్పాటు కానున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు తెలిపారు. ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించిన భూముల్లో చదును పనులను పరిశీలించారు. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కోసం రెవెన్యూ శాఖ ఇక్కడ 30 ఎకరాలను కేటాయించిందని తెలిపారు. సోమవారం ఇక్కడ జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, కలెక్టర్ విజయకృష్ణన్, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నదని, చోడవరం నియోజకవర్గానికి సంబంధించిన పార్కును ఆర్.భీమవరంలో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. కాగా ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించిన భూమిలో చదును పనులను తహాశీల్దారు ఎం.లక్ష్మి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తదితరులు పరిశీలించారు.

## యుద్ధప్రాతిపదికన మాచ్‌ఖండ్ పునరుద్ధరణ పనులు



**ముంచంగిపుట్టు, పతాకం న్యూస్:** భారీ అగ్నిప్రమాదంతో నిలిచిపోయిన మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని పునరుద్ధరించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ప్రమాద సంఘటనపై సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్(సీఈ) కేవీ రాజారావు ముగ్గురు సభ్యుల ఉన్నత స్థాయి బృందంతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. ప్రమాదం జరిగిన కంట్రోల్ రూమ్, ఎక్సైటేషన్ క్యూబికల్స్, 11 కేవీ బ్రేకర్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక ప్రాజెక్టు అధికారులు, సిబ్బందితో సుదీర్ఘ సమీక్ష నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో మొదట 11 కేవీ బ్రేకర్ పేలడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని, దాంతో జనరేటర్ల విద్యుదుత్పత్తి నిలిచిపోయిందని సీఈ కేవీ రాజారావు స్పష్టం చేశారు. మంటలు ఆ తరువాత 5వ నంబరు ఎల్‌ఏబీటీకి వ్యాపించాయని, అక్కడ కూడా పేలుడు సంభవించడంతో ప్రమాద తీవ్రత పెరిగిందన్నారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అదుపు చేయడం అసాధ్యంగా మారిందని చెప్పారు. ప్రమాదం తరువాత ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు ఇంజనీరింగ్ విభాగం శ్రమిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో కాలిపోయిన పాత కేబుల్ వైర్లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో నూతన కేబుళ్లను వేసే పనులు చేపడుతున్నారు. అలాగే కాలిపోయిన ప్యానెళ్ల వివరాలను సేకరించి, వాటి స్థానంలో నూతన ప్యానెళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఆరు జనరేటర్లకు సంబంధించిన మెకానికల్ బేరింగులను నిపుణులు నిశితంగా పరిశీలించి బాగు చేస్తున్నారు. ప్రస్తుతం డుడుమ నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. టీపీ డ్యామ్ వద్ద నీటిని సిల్ట్ గేట్లను ఎత్తి పూర్తిగా ఖాళీ చేశారు. ప్రాజెక్టు పరిధిలో విద్యుత్ ఇబ్బందులు లేకుండా విశాఖ నుంచి బ్యాక్ ఫీడింగ్ ద్వారా విద్యుత్‌ను దిగుమతి చేసుకొని ప్రస్తుతానికి సరఫరా చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఎస్ఈ సీహెచ్ అప్పాజీ, సివిల్ ఎస్ఈ జకీర్ హుస్సేన్, మోతుగూడెం ఈఈ బాలకృష్ణ, ఈఈ (జనరేషన్) బి.గోవిందరాజులు, ఈఈ (సివిల్)కురేష్ ప్రదాన్‌లు పాల్గొన్నారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని ఏపీ జెన్‌కో జల విద్యుత్ డైరెక్టర్ విజయ్‌కుమార్ తన ప్రత్యేక టెక్నికల్ బృందంతో సందర్శించనున్నారు. ప్రాజెక్టులో 11 కేవీ వాక్యూం సర్క్యూట్ బ్రేకర్ (వీసీబీ)లు పేలిపోవడంతో ప్రాజెక్టులో మంటలు చెలరేగి విద్యుదుత్పాదన నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జల విద్యుత్ డైరెక్టర్ ఇక్కడ జరిగిన నష్టాన్ని అంచనా వేయడంతో పాటు త్వరితగతిన విద్యుదుత్పా దన పునరుద్ధరణకు తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేయనున్నారు.

## దివీస్ లేబొరేటరీస్ సహకారంతో మారిన కె.బెడ్డగుడ ఎంపీపీ స్కూల్ రూపురేఖలు




**అరకులోయ, పతాకం న్యూస్:** మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ కె.బెడ్డగుడ గ్రామంలో ఉన్న మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల రూపురేఖలు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అందంగా తయారైంది. దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ సహకారంతో భవనాల ఆధునికీకరణ, మౌలిక వసతులు కల్పించారు. కె.బెడ్డగుడ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు 37 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే ఈ పాఠశాల అరకొర వసతులతో అధ్వానంగా ఉండేది. పాఠశాల ప్రాంగణంలో మరో భవనం అసంపూర్తిగా ఉండేది. మరుగుదొడ్లు, నీటి సదుపాయం లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ప్రహరీ గోడకు బదులు కర్రలతో దడి కట్టి ఉండేది. ఈ పాఠశాల దుస్థితిని శారదా ట్రస్టు నిర్వాహకులు దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆ కంపెనీ జనరల్ మేనేజర్ వై.ఎస్.కోటేశ్వరరావు, డిప్యూటీ మేనేజర్ పి.జగదీశ్, మేనేజర్ డి.సురేశ్‌కుమార్ ఆ పాఠశాలను ఆరు నెలల క్రితం సందర్శించారు. ఈ విషయాన్ని దివీస్ ఫార్మా కంపెనీ సీఎండీ డాక్టర్ మురళి కె.దివి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి పాఠశాల ఆధునికీకరణకు సుమారు రూ.24.73 లక్షలు ఇచ్చారు. ఈ నిధులతో పాఠశాల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. ప్రస్తుతం భవనాల ఆధునికీకరణతో పాటు పక్కన అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేశారు. పిల్లలు ఆడుకునేందుకు ప్లే పార్కు, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. తరగతి గదుల్లో అక్షరమాల, బొమ్మలను వేయించారు. పాఠశాల పునఃప్రారంభం నాటికి పూర్తి స్థాయిలో భవనాలు అందుబాటులోకి రానున్నాయి. కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా పాఠశాల తయారుకావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వర్చువల్ మహానాడును విజయవంతం చేద్దాం




**అనకాపల్లి, పతాకం న్యూస్:** : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే వర్చువల్ మహానాడు కార్యక్రమాలను విజయ వంతం చేయాలని టీడీపీ విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల జోనల్ కో-ఆర్డినేటర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పిలుపునిచ్చారు. జోనల్ కో-ఆర్డినేటర్‌గా ఎన్నికైన తరువాత తొలిసారిగా అనకాపల్లి టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. అంతకు ముందు పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, స్థానిక నేతలతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో టీడీపీ అధ్యక్షుడితో పాటు అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులు, నాయకులకు అందుబాటులో ఉంటానన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, పార్టీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, పార్టీ జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, నాయకుడు దాడి రత్నాకర్, తదితరులు ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

# వేడిగాలులకు చనిపోతున్న కోళ్లు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఈ వేసవిలో ఎండలు పౌల్ట్రీ పరిశ్రమను దెబ్బ తీస్తున్నాయి. ఎండల ధాటికి వడగాలులు తోడవుతుండడంతో పౌల్ట్రీ ఫారాల్లో పదుల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో నిర్వాహకులు తమకు నష్టం తప్పడం లేదని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది యువత కోళ్లఫారాల ద్వారా స్థానికంగా జీవనోపాధి పొందుతున్నారు. వ్యవసాయంతో అనుసంధానంగా కోళ్లను పెంచుతున్నారు. ఒక్క రణస్థలం మండలం పరిధిలోని 250 కోళ్ల ఫారాలు ఉన్నాయి. సుమారు 15 లక్షల వరకూ కోళ్లను పెంచుతున్నారు. ఎచ్చెర్లలో 2 లక్షల కోళ్లు, లావేరు 50వేల కోళ్లు, జి.సిగడాంలో 2 లక్షల వరకూ కోళ్లు పెంచుతున్నారు. జిల్లాలో గుడ్లుపెట్టే కోళ్లఫారాలు సైతం విరివిగా ఉన్నాయి. కోడిపిల్లలు ధరతోపాటు నిర్వహణ ఖర్చులు పెరగడం, ఇప్పుడు వేసవి తాపానికి కోళ్లు చనిపోతుండడంతో నిర్వాహకులు నష్టపోతున్నారు. ఒక్కో కోడి అందుబాటులోకి వచ్చేసరికి 45 రోజుల సమయం పడుతుంది. దాని సంరక్షణకు రూ.160 ఖర్చు చేయాల్సి వస్తోంది. వర్షాలు లేక కోళ్లమేతకు ఉపయోగించే మొక్కజొన్న, తవుడు కొరత ఏర్పడి మేత ఖర్చులు పెరిగిపోయాయి. విద్యుత్ చార్జీలు కూడా పెరిగిపోయాయి. ఎండ తీవ్రతతో కోళ్ల ఉత్పత్తి కూడా తగ్గిపోయింది. మరోవైపు వడగాల్పుల దెబ్బకు 20 నుంచి 25 రోజుల వ్యవధిలో కోళ్లు మృతి చెందడంతో నిర్వహణ కష్టమవుతోందని నిర్వాహకులు వాపోతున్నారు. కోళ్లు ఎండల తీవ్రతను తట్టుకునేలా షెడ్లకు చుట్టూ తడి గోనె సంచులు కడుతున్నారు. వాటికి ఎప్పటికప్పుడు నీటితడులు అందిస్తున్నారు. రణస్థలం మండలంలో నీటికొరత ఉండడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తెస్తున్నామని, అదనపు భారం తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

# బోటు షికారుకు వేసవి దెబ్బ!



**గరుగుబిల్లి, పతాకం న్యూస్:** అధిక ఎండల నేపథ్యంలో తోటపల్లిలో పర్యాటకుల సందడి తగ్గింది. ఇక్కడున్న ఐటీడీఏ పార్కుకు కూడా అంతంతమాత్రంగానే సందర్శకులు వస్తున్నారు. తోటపల్లి ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన బోటు షికారుకు గతంలో పర్యాటకులు ఆసక్తి చూసేవారు. అయితే ఎండలు ఒకవైపు, మరోవైపు ఉక్కపోత అధికంగా ఉండడంతో బోటు షికారుకు ఎవరూ అంతగా మొగ్గు చూపడం లేదు. ఇదిలా ఉండగా ఇక్కడున్న రెండు ప్రధాన బోట్లు మరమ్మతులకు గురికావడంతో చిన్నపాటి బోట్లునే వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో స్పీడ్ బోటు, కయల్ (తెడ్డుతో నడిచే) బోట్లు, ఫెడరల్ బోటు అందుబాటులో ఉన్నాయి. మూలకు చేరిన బోట్లుపై అధికారులు దృష్టి సారించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# గోవధకు పాల్పడితే పీడీ యాక్టు: ఎస్పీ దామోదర్



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో ఎవరైనా పశువుల అక్రమ రవాణా, గోవధకు పాల్పడితే చట్టరీత్యా వారిపై కఠిన చర్యలు తప్పవని, పీడీయాక్టు ప్రయోగిస్తామని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలపై జిల్లా పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. చట్టాలను అమలు చేయడంతో పాటు జంతువులను పరిరక్షించడమే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయన్నారు. ఈ ప్రక్రియలో సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగు, డ్రోన్ నిఘా వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. గోవులను అక్రమంగా తరలించడం, హింసించడం అనుమతులు లేకుండా వధ శాలలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని చెప్పారు. జిల్లాలో చెక్‌పోస్టులు బలోపేతం చేశామని, నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో గోవుల అక్రమ రవాణాకు అవకాశం వున్న అన్ని దారుల్లో అధికారులు, సిబ్బందితో నిఘా పెట్టామని, వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. రాత్రి వేళల్లో వాహన తనిఖీలు మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకూ పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై 11 కేసులు నమోదు చేసి 25 మందిని అరెస్టు చేయడంతో పాటు 12 వాహనాలను, 156 పశువులను సీజ్ చేశామని తెలిపారు.

# చేతికొచ్చిన పంటలను నాశనం చేసిన ఏనుగులు.. రైతన్నల ఆవేదన

**తిరుపతి, పతాకం న్యూస్:** యర్రావారిపాలెం మండలంలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. కూరపర్తివారిపల్లి, నెరబైలు, మడిచెరువు అటవీ సమీపంలోని మామిడి తోటలు, టెంకాయ, వరి పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. నేడు, రేపో మామిడి కాయలను మండీలకు తరలించే సమయంలో ఈ విధంగా ఏనుగులు నష్టం కలిగించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంటను ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గడిచిన 4 నెలల కాలంలో సుమారు 60% వరకు అన్ని పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఏనుగుల గుంపు ఇలా పంటలను నాశనం చేస్తూ నష్టం కలిగిస్తూ పోతే తమకు చావే శరణ్యమంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏనుగుల గుంపు నుంచి తమ పొలాలను కాపాడే విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఫారెస్ట్ అధికారులను రైతులు కోరారు.

# పెట్రో ధరల పెంపు దారుణం: సీపీఎం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వరుసగా పెంచుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సామాన్యులు, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విమర్శించారు. పెంచిన ధరలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రో ధరల పెంపును ఖండిస్తూ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయం ఏచూరి భవన్ నుంచి మద్దిలపాలెం జంక్షన్ వరకు వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. మోటారు బైకులను నెట్టుకుంటూ ఈ ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ ఎనిమిది రోజుల్లో మూడు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచారని, లీటరుకు సుమారు రూ.5 వరకు, సిఎన్ జి గ్యాస్‌పై కేజీకి రూ.4 వరకూ భారం మోపారన్నారు. వాణిజ్య వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.114కు పెంచారని దుయ్యబట్టారు. ఇంధన ధరల పెంపు ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఒకేసారి ధరలు పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని భావించి దఫాదఫాలుగా పెంచుతూ మోడీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వివరించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశ ప్రజలపై పడనీయబోమని, ఆయిల్, గ్యాస్ కొరత ఉండదని కేంద్ర ప్రభుత్వం చెప్పిందని, కానీ ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యిన వెంటనే ధరలు పెంచడం ప్రారంభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మద్దతునిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన ధరలపై విధిస్తున్న పన్నులను ఇప్పటికైనా తగ్గించి, పెంచిన ధరలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అమెరికా-ఇజ్రాయిల్ చర్యల కారణంగా ఏర్పడుతున్న అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని హర్మూజ్ జలసంధి దిగ్బంధనాన్ని నివారించే చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ కెఎస్‌వి.కుమార్, వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు పి.పైడిరాజు, ఎం.రాంబాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్, సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# పూరిగుడిసెల్లో నివసిస్తున్న కళింగదళ్ రిజర్వాయర్ నిర్వాసితులు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** గ్రామం ముంపునకు గురైతే పునరావాసం కల్పిస్తాం. సకల సౌకర్యాలతో ఇళ్లు కట్టిస్తాం. భూములు ఇస్తాం. ఇవీ కళింగదళ్ రిజర్వాయర్ నిర్మాణం సమయంలో ముంపునకు గురైన కురడాలు గ్రామస్థులకు నాటి ప్రభుత్వం ఇచ్చిన హామీలు. కానీ ఆ హామీలన్నీ నీటిలో కలిసి పోయాయి. కళింగదళ్ రిజర్వాయర్ గర్భంలో ఉన్న కురడాలు గ్రామాన్ని ఖాళీ చేయించి రిజర్వాయర్ కిందభాగంలోని మెట్టు ప్రాంతానికి తరలించారు. తమ భూములు బాగుపడతాయనే ఆశయంతో రిజర్వాయర్ నిర్మాణానికి ఏ మాత్రం గ్రామస్థులు అడ్డుచెప్పలేదు. దీంతో ప్రభుత్వం సుమారు 22 ఇళ్ల నిర్మాణానికి అనుమతించింది. అధికారులు ఒక కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణ పనులు అప్పగించారు. అక్కడే అమాయకులైన గిరిజనులు మోసపోయారు. ఆ ఇళ్ల నాణ్యతాలోపం రెండేళ్లు దాటిన తరువాత తెలిసింది. చిన్నపాటి వర్షానికే నీరుకారి.. కనీసం నివసించేందుకు యోగ్యత లేకపోవడంతో నాలుగేళ్లకే పూర్తిగా ఇళ్లు ఖాళీ చేసి పూరిగుడిసెల్లో నివాసముంటున్నారు. నేటికి 38 ఏళ్లు అయినా.. తమకు నాణ్యమైన పక్కా ఇళ్లు నిర్మించడం లేదని నిర్వాసిత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. తమ ఇళ్ల రాతలు మారడం లేదని వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఇందిరమ్మ, వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలు వీరి ఇళ్లలో మార్పులు తీసుకురాలేదు. గతంలో కనీసం కాలనీలు మంజూరు చేస్తే ఈ ఇళ్లకు మరమ్మతులు చేపట్టి ఎలాగోలా నివాసం ఉంటామన్నా.. కనీసం అధికారులు పట్టించుకోలేదని పలువురు గిరిజనులు వాపోతున్నారు. ఇది పునరావాస కాలనీ కనుక వీటిపై ఎలాంటి ఇళ్లు ఇవ్వమని గతంలో అధికారులు చెప్పారు. దీంతోపాటు పునరావాస లబ్ధిదారులకు ఇందిరమ్మ కాలనీలకు అనర్హులని తేల్చిచెప్పడంతో వారంతా ఆందోళన చెందారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

# ఉపాధి కూలీలకు హెచ్‌ఐవి ఎయిడ్స్ సుఖ వ్యాధుల పరీక్షలు



**విజయనగరం, పతాకం న్యూస్:** ఉపాధి హామీ కూలీలకు హెచ్‌ఐవి, ఎయిడ్స్ సుఖ వ్యాధి పరీక్షలను ఐసిటిసి సిబ్బంది నిర్వహించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కొండకారకం గ్రామంలో మొబైల్ ఐ సి టి సి ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా హెచ్‌ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధులు, టీబీ, బిపి వ్యాధులపై అవగాహన కల్పించి రక్త పరీక్షలు చేయడం జరిగింది. ప్రతి ఒక్కరూ కూడా హెచ్‌ఐవి ఎయిడ్స్ అవగాహన కలిగి ఉండాలని రక్త పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. మొబైల్ ఐ సి టి సి కౌన్సిలర్ సిహెచ్ కోటారావు మాట్లాడుతూ ... హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఉన్నవారిపట్ల వివక్షత చూపకుండా మంచి భావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మి, ఎం ఎల్ హెచ్ పి మౌనిక, మొబైల్ ఐ సి టి సి ల్యాబ్ టెక్నీషియన్ కే. అప్పలనాయుడు, లింక్ వర్కర్ పైడితల్లి ఐ సి టి సి స్టాఫ్ పాల్గొన్నారు.

# రూపాయి వాస్తవిక విలువ కంటే తక్కువగా ట్రేడ్ అవుతోంది: ఆర్బీఐ గవర్నర్

**ముంబై, పతాకం న్యూస్:** డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి బలహీనపడుతున్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం రూపాయి విలువ ఓవర్ వాల్యూగా ఉందని చెప్పలేమని, అయితే వాస్తవిక విలువ కంటే తక్కువగా ట్రేడ్ అవుతోందని మాత్రం చెప్పగలమని అన్నారు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలు పెరగడం మొదలైన కారణాలతో ఇటీవల రూపాయి విలువ భారీగా పతనమైంది. రూపాయికి ఒక నిర్దిష్ట విలువను లక్ష్యంగా పెట్టుకోవడం కంటే, కరెన్సీ మార్కెట్‌ను స్థిరంగా ఉంచడానికే ఆర్బీఐ ఎక్కువ ప్రాధాన్యమిస్తుందని సంజయ్ మల్హోత్రా తెలిపారు. రూపాయి విలువకు సంబంధించి ఎలాంటి నిర్దిష్ట మారకపు రేటు స్థాయినీ ఆర్బీఐ లక్ష్యంగా పెట్టుకోలేదని అన్నారు. అలాంటి విషయాల్లో కేంద్ర బ్యాంకు జోక్యం చేసుకోదని స్పష్టం చేశారు. ఫారెక్స్ మార్కెట్‌లో అసాధారణ అస్థిరత లేదా ఊహాగానాలను అరికట్టేందుకు మాత్రమే కేంద్ర బ్యాంక్ జోక్యం చేసుకుంటుందని తెలిపారు.

# విద్యుదాఘాతంతో యువకుడి మృతి



**గంట్యాడ, పతాకం న్యూస్:** విద్యుదాఘాతంతో యువ కుడు మృతిచెందిన ఘటన మండలంలోని నీలావతి గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి గంట్యాడ ఏఎస్ఐ రమణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండ లంలోని నీలావతి గ్రామానికి చెందిన కాట వీరస్వామి, ఎర్ర య్యమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరికీ వివాహం అయ్యింది. కుమారుడు చినబాబు(25) బీటెక్ పూర్తి చేశాడు. ప్రభుత్వం ఉద్యోగం సాధించాలని ఉద్దేశంతో కాకినాడలో ఓ కోచింగ్ సెంటరులో శిక్షణ తీసుకున్నాడు. ఈనెల 22న కాకినాడ నుంచి స్వగ్రామైన నీలావతికి వచ్చాడు. శనివారం రాత్రి భోజ నం చేసిన అనంతరం పక్కనే ఉన్న కాట గున్నమ్మ ఇంట్లో నిద్ర చేయడానికి వెళ్లాడు. ఆ సమయంలో టేబుల్ ఫ్యాన్ వేసుకుందామని ప్లగ్‌ను స్విచ్ బోర్డులో పెడుతున్న తరుణంలో చినబాబు షాక్ గురై కింద పడిపోయాడు. వెంటనే కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చినబాబు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇంటికి ఆస రాగా నిలుస్తున్న కుమారుడు మృతిచెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీ రుగా విలపిస్తోంది. దీంతో నీలావతి గ్రామంలో విషాద ఛాయలు అలముకు న్నాయి. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# జ్వరంతో గిరిజన బాలుడి మృతి



**కురుపాం, పతాకం న్యూస్:** గుజ్జులగండ గ్రామానికి చెందిన గిరిజన బాలుడు నిమ్మక వరుణ్ తేజ్ (4) జ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బిడ్డకు జ్వరం రావడంతో నిమ్మక కియ్య, జయసుధ కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. మధ్యాహ్నం బాలుడికి ఫిట్స్ వచ్చింది. దాంతో మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. బాలుడి మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్‌కుమార్ బాలుడుకు పరీక్షలు నిర్వహిచామని, మలేరియా లేదని తెలిపారు.

# హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట.. రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం కుదిరింది. రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు అధికారికంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఈ డీల్ ఖరారైంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం రాబోయే 20 ఏళ్ల కాలపరిమితితో, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ రుణాన్ని చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. దీనివల్ల హైదరాబాద్ మెట్రోపై ఉన్న తక్షణ ఆర్థిక భారం తగ్గనుంది. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు కీలక విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో 100 శాతం యాజమాన్య వాటా పూర్తిగా ప్రభుత్వానికే బదిలీ అయినట్లు స్పష్టం చేశారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశ ఆర్థిక వృద్ధిలో హైదరాబాద్ నగరం కీలక ఇంజిన్‌లా మారుతోందని సీఎస్ పేర్కొన్నారు. మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రీఫైనాన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్‌ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో కేంద్రం కొత్త నిబంధనలివే..



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పెద్దకడబూరు మండలం, కొత్త గ్రామీణ ఉపాధి హామీ చట్టం 'వీబీజీ రామ్ జీ' ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ కొత్త చట్టం జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు ప్రకటించింది. ముసాయిదా నిబంధనలపై ప్రజలు, నిపుణుల నుంచి అభిప్రాయాలను జూన్ 21వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు కేంద్రం వెల్లడించినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. కొత్త విధానం ప్రకారం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర నిధుల కేటాయింపులో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ముఖ్యంగా పెద్ద రాష్ట్రాలు, ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ముసాయిదాలో పేర్కొంది. 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం జనాభా, తలసరి ఆదాయాన్ని ఆధారంగా తీసుకుని నిధులను పంపిణీ చేయనుంది. ఇందులో తలసరి ఆదాయం తక్కువగా ఉన్న రాష్ట్రాలకు 42.5 శాతం అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం ప్రతిపాదించింది. అలాగే ఇప్పటివరకు ఉపాధి హామీ పథకంలో వేతన భారం మొత్తం కేంద్ర ప్రభుత్వం భరించగా, కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉంటుంది. దీంతో రాష్ట్రాలపై కూడా ఆర్థిక బాధ్యత పెరగనుంది. రెండో ఏడాది నుంచి రాష్ట్రాల పనితీరు ఆధారంగానే అదనపు నిధుల కేటాయింపు ఉండనుంది. కూలీలకు సమయానికి వేతనాల చెల్లింపు, సోషల్ ఆడిట్ అమలు, పనుల పూర్తి శాతం వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని రాష్ట్రాల పనితీరును అంచనా వేయనున్నారు. ఈ మార్పులతో గ్రామీణ ఉపాధి పథకాల అమల్లో పారదర్శకత, బాధ్యత పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది అని అధికారులు పేర్కొన్నారు.

## సీయూఈటీ పరీక్ష వాయిదా




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా జరగనున్న కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ-యూజీ) పరీక్షల షెడ్యూల్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది. మే 28వ తేదీన జరగాల్సిన ప్రవేశ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధికారికంగా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ఈద్-ఉల్-జుహా (బక్రీద్) పండుగకు సంబంధించిన ప్రభుత్వ సెలవు తేదీని సవరించినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (ఐశ్రీూ) జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, మే 28న జరగాల్సిన సీయూఈటీ-యూజీ పరీక్ష రెండు షిఫ్టులనూ వాయిదా వేశారు. ఈ మార్పు వల్ల ప్రభావితమైన విద్యార్థులకు కొత్త పరీక్ష తేదీలను త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. విద్యార్థులు ఆందోళన చెందవద్దని, తాజా సమాచారం కోసం ఎప్పటికప్పుడు తమ అధికారిక పోర్టల్‌ను తనిఖీ చేయాలని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా 280కి పైగా కేంద్రీయ, రాష్ట్ర, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎన్‌టీఏ ఈ జాతీయ స్థాయి పరీక్షను నిర్వహిస్తోంది. ఈ ఏడాది సుమారు 15 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. మే 11 నుంచి మే 31 వరకు వివిధ తేదీల్లో కంప్యూటర్ ఆధారిత విధానంలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి.

## పింఛన్ల మిగులు నిధుల జమలో నిర్లక్ష్యం

### డీఆర్వో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన మండల అధికారులు



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల మిగులు నిధులు జమ చేయడంలో కొంతమంది సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి నెలా ఆరో తేదీలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయడం లేదు. దీంతో జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలలో 1.37 లక్షల మంది పింఛన్‌దారుల కోసం సచివాలయాల వారీగా రూ.18.56 కోట్లు విడుదల చేశారు. అయితే పలు రకాల పింఛన్‌దారులకు రూ. 17.83 కోట్ల వరకూ పంపిణీ చేశారు. మృతి చెందిన వారు, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారితో పాటు పలు కారణాలతో పింఛన్ తీసుకోని వారి మొత్తాలను సచివాలయాల సిబ్బంది తిరిగి జమ చేయాల్సి ఉంది. అయితే సుమారు రూ.35.25 లక్షలను నేటికీ జమచేయలేదు. ఈ క్రమంలో శనివారం డీఆర్వో కె.హేమలత వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత ఎంపీడీవోలతో సమీక్షించారు. సచివాలయ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశించిన సమయంలోగా పింఛన్ మిగులు నిధులు జయచేయని వారికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా పింఛన్లు పంపిణీపై ప్రభుత్వం సచివాలయాల వారీగా లబ్ధిదారులకు ఐవీఆర్ఎస్ కాల్స్ చేసి సమాచారం సేకరిస్తోంది. పింఛన్‌దారుల నుంచి సిబ్బంది లంచం తీసుకుంటున్నారా? వారి ప్రవర్తనా నియమావళి, పింఛన్లను ఇంటి వద్దే అందిస్తున్నారా? అన్న దానిపై వివరాలు సేకరిస్తున్నారు. అయితే ఈ మొత్తం సమాచారం ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లింది. దీంతో వారు సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ తీరు, మిగులు నిధుల జమ తదితర అంశాలపై దృష్టి సారించారు.

# కుంటుపడిన నీటి నిల్వలు..!

## పలు మండలాల్లో ఉనికిలో లేని ఊట కుంటలు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జల సంరక్షణ నిర్మాణాల లెక్కలు కాగితాలపై ఘనంగానే కనిపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో నీటి నిల్వల పరిస్థితి మాత్రం తీవ్ర నిరాశ పరుస్తోంది. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు, పంట కుంటలు, ఊట కుంటలు ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదు. ఆంధ్రప్రదేశ్ వాటర్ రిసోర్సెస్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఏపీడబ్ల్యూఆర్ఐఎంఎస్) వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తాజా గణాంకాలు జిల్లా పరిస్థితికి అద్దం పడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా వేలాది సంఖ్యలో నీటికుంటలు నిర్మించినా.. పూర్తిసామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయడంలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చెరువులు సైతం నీరు లేక ఎండిపోతున్నాయి. జిల్లావ్యాప్తంగా 31,529 జల సంరక్షణ నిర్మాణాలు ఉన్నాయి. వీటి ద్వారా 2,138.72 ఎంసీఎఫ్‌టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్లు) నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో ప్రస్తుతం కేవలం 105.42 ఎంసీఎఫ్‌టీ (సుమారు 5శాతం కన్నా తక్కువ) నీరు మాత్రమే నిల్వ ఉండటం గమనార్హం. జిల్లాలో అత్యధికంగా మందస మండలంలో 7.3 ఎంసీఎఫ్‌టీ నీరు, జి.(గంగువారి) సిగడాంలో 7.04 ఎంసీఎఫ్‌టీ నీరు నిల్వ ఉంది. జిల్లాలో 4,135 చెక్‌డ్యామ్‌లు ఉండగా, వాటి నీటి నిల్వ సామర్థ్యం 1,450.55 ఎంసీఎఫ్‌టీగా ఉంది. వాటిలో నిల్వ ఉన్న నీరు కేవలం 66.57 ఎంసీఎఫ్‌టీ మాత్రమే. అలాగే 6,761 పంట కుంటలు లేదా ఫార్మ్‌పాండ్స్ (సామర్థ్యం 48 ఎంసీఎఫ్‌టీ, నిల్వ 13.54 ఎంసీఎఫ్‌టీ), 534 ఊట కుంటలు లేదా పెర్కొలేషన్ ట్యాంకులు (సామర్థ్యం 188.5 ఎంసీఎఫ్‌టీ, నిల్వ 4.76 ఎంసీఎఫ్‌టీ) ఉన్నాయి.

జిల్లాలోని మండలాల వారీగా జల సంరక్షణ నిర్మాణాలు సంఖ్య, వాటి సామర్థ్యాన్ని పరిశీలిస్తే తీవ్ర హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. ఎచ్చెర్ల మండలం 1,950 నిర్మాణాలతో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. దీని తర్వాత స్థానాల్లో లావేరు (1,848). బూర్జ (1,778), గార (1,757), పోలాకి (1,727) మండలాలు ఉన్నాయి. హిరమండలంలో అత్యల్పంగా కేవలం 306 నిర్మాణాలు మాత్రమే ఉన్నాయి. కవిటి (401), వజ్రపుకొత్తూరు (529), ఇచ్ఛాపురం (556) మండలాలు కూడా తక్కువ నిర్మాణాలతో వెనుకబడి ఉన్నాయి.

లావేరు మండలంలో అత్యధికంగా 384 చెక్‌డ్యామ్‌లు ఉన్నాయి. ఆ తర్వాత మెళియాపుట్టి (294), పాతపట్నం (273) మండలాలు ఉన్నాయి. పోలాకి మండలంలో కేవలం 14 చెక్‌డ్యామ్‌లు మాత్రమే ఉన్నాయి. ఎచ్చెర్ల మండలంలో రికార్డుస్థాయిలో 882 పంట కుంటలు ఉండగా, లావేరులో 574 ఉన్నాయి.

పోలాకి మండలంలో 1,727 నిర్మాణాలు ఉన్నప్పటికీ, అక్కడ కేవలం 0.62 ఎంసీఎఫ్‌టీ నీరు మాత్రమే నిల్వ ఉంది. అలాగే 896 నిర్మాణాలు ఉన్న కోటబొమ్మాళిలో 0.85 ఎంసీఎఫ్‌టీ నీరు మాత్రమే ఉంది. ఈ గణాంకాలు చూస్తుంటే నిర్మాణాలు నామమాత్రంగా ఉన్నాయా లేక పూడికతీత పనులు జరగలేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తూరులో అత్యధికంగా 110 ఊట కుంటలు ఉన్నాయి. గార, కంచిలి, పోలాకి, సరుబుజ్జిలి, సోంపేట మండలాల్లో భూగర్భజలాలను పెంచే కీలకమైన ఊట కుంటలు సున్నాగా నమోదు కావడం ప్రణాళికా లోపాన్ని ఎత్తిచూపుతోంది. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో, నిర్మాణాలను బాగుచేసి, పూడికలు తీసి, పూర్తి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్లు, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

**అమరావతి, పతాకం న్యూస్:** ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్లు వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిటిఎల్ పిడబ్ల్యూఎ) ఆధ్వర్యాన జరిగిన సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ సదస్సుకు ముఖ్య వక్తగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకులకు గుర్తింపు కార్డు, హెల్త్‌కార్డులివ్వాలని మండలిలో పలుమార్లు ప్రస్తావించినట్లు చెప్పారు. వెల్ఫేర్ బోర్డు, నిధిని ఏర్పాటు చేయాని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశామన్నారు. ఈ హక్కులను ప్రభుత్వం నుండి సాధించుకోవాలంటే అందరూ ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, అందులో తాము కూడా భాగస్వామ్యం అవుతామని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థల్లో కన్నా ప్రైవేటు రంగంలోనే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. 12 నెలల జీతం లేదని, గౌరవం కూడా ఉండటం లేదని తెలిపారు. జిఓ ఒకటి ప్రకారం ఫీజులో 50 శాతం ఉపాధ్యాయులు జీతాలకే కేటాయించాలనే నిబంధన ఉన్నా దానిని అమలు చేయడం లేదన్నారు. పోరాడి వీటిని సాధించుకోవాలన్నారు. సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకునేందుకు టోల్ ఫ్రీ నెంబర్ వేర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వివిధ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారంతా సమస్యల పరిష్కారం కోసం ఐక్యం కావాలని కోరారు. బోధనేతర సిబ్బందిని కూడా కలుపుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. వినతులు, ఆన్‌లైన్ పిటిషన్లు, సామూహిక సంతకాల ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, అందుకు సిఐటియు తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎం సూర్యారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి హక్కులు సాధించుకోవాలంటే కింది స్థాయిలో యాజమాన్యాల సహకారం తీసుకోవాలని చెప్పారు. 12 నెలల జీతం, ప్రభుత్వ విద్యాసంస్థల్లో అమలయ్యే అన్ని సెలవులు ప్రైవేటు వారికి ఇవ్వాలని కోరారు. సిబ్బంది రక్షణ కోసం చట్టం చేయాలని చేసిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సదస్సుకు ప్రొఫెసర్ ఎన్ లెనిన్ బాబు అధ్యక్షత వహించగా, అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కిరణ్ వేదిక మీదకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, శ్రీవాణి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, రమణ, మధు, సురేష్ బాబు, వాసునాయక్ తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం 23 మందితో రాష్ట్ర కన్వీనింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# చాలామందికి డబ్బు ఉన్నా సేవా గుణం ఉండదు

**కొత్తవలస, పతాకం న్యూస్:** 'చాలా మంది దగ్గర డబ్బు ఉన్నా సేవా గుణం ఉండదు. సేవ చేసే వారికే సమాజంలో గుర్తింపు ఉంటుంది. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి.' అని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మండలంలోని మంగళపాలెంలో ఉన్న గురుదేవ చారిటబుల్ ట్రస్టును బీజేపీ నాయకులతో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ..



మంగళపాలెం లాంటి గ్రామంలో దేశం గర్వపడే సేవలను అందిస్తున్న ట్రస్టు ఉండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇంతటి చిన్నగ్రామంలో ట్రస్టు ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు మంచి పేరు తెచ్చుకుంటున్నారన్నారు. త్వరలోనే ఆయనకు గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ కార్యక్రమం చేపట్టారని, అందులో గురుదేవ ట్రస్టు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించేందుకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు, క్యాన్సర్ రోగులకు వైద్యం చేయడానికి దేవుడు గురుదేవ ట్రస్టు రూపంలో వచ్చాడన్నారు. ఈ ట్రస్టు ద్వారా భవిష్యత్తులో ఎన్నో సేవలు అందించి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. తొలుత దివ్యాంగులకు అందిస్తున్న కృత్రిమ అవయవాల కేంద్రాన్ని, గురుదేవ ఆసుపత్రిని, ఉప్పలపాటి విజయశ్రీ క్యాన్సర్ ఆసుపత్రిని సందర్శించి సేవలను పరిశీలించారు. అంతకు ముందు కర్ణాటక బీజేపీ నాయకుడు, సినీనటుడు సాయికుమార్ సోదరుడు పి.అయ్యప్పశర్మ.. బండారు దత్తాత్రేయను కలసి వెళ్లారు. ఈ సందర్భంగా అయ్యప్ప శర్మనుట్రస్టు కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ జగదీష్ బాబుతో పాటు బీజేపీ నాయకులు రామ కోటయ్య, మల్లా రెడ్డి, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ కరక దేముడు తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల పునర్విభజన సక్రమంగా లేదు



**పాలకొండ, పతాకం న్యూస్:** పట్టణంలోని వార్డుల పునర్విభజన సక్రమంగా లేదని సీపీఐ నేతలు కూరంగి మన్మథరావు, బుడితి అప్పల నాయుడు, బుడి భారతి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాస్త్రీయ విభజన కోసం రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేథావులు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఏ వార్డులో ఎంతమంది ఓటర్లు ఉన్నారో ఖచ్చితమైన జాబితా లేకుండాపోయిందన్నారు. అలాగే నగర పంచాయతీ కమిషనర్‌కు వార్డుల విభజనపై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వినతిపత్రాన్ని సమర్పించారు.

## పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి : కిసాన్ మోర్చా




**ప్రకాశం, పతాకం న్యూస్:** పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ .... సోమవారం అన్ని పొగాకు బోర్డుల వద్ద కిసాన్ మోర్చా నాయకత్వంలో నిరసనలు జరిగాయి. అందులో భాగంగా ఈరోజు టంగుటూరు టొబాకో బోర్డు వద్ద ఆందోళన జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వేజెండ్ల సింగయ్య మాట్లాడుతూ .... గత సంవత్సరం పొగాకు మార్కెట్ సంక్షోభం కారణంగా వచ్చే నష్టాలు తోడుగా ఈ సంవత్సర పరిస్థితి మరింతగా దిగజారిందని అన్నారు. రూ.250 రూపాయలతో ప్రారంభమైన కొనుగోలు రూ.190 రూపాయలు దిగజారిందని భవిష్యత్తులో ఇంకా ఎంత దిగజారుతుందని రైతులు భయాందోళనలో ఉన్నారని తెలిపారు. అంతేకాక 75 శాతం నోబిట్లుగా వెనక్కి పంపించే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనివల్ల రైతులు కౌలు రైతుల నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతు నష్టపోకుండా ఉండాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు కొనుగోలుకు రూ.500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కింటాకు రూ.36000 తగ్గకుండా సమైక్య ఎస్టిసి పొగాకును పూర్తిగా కొనుగోలు చేయాలని కోరారు. తదనంతరం పొగాకు బోర్డు ఇంచార్జ్ వేలం నిర్వహణధికారి రాంమోహన్ సూరి కి అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు కే నాంచార్లు కృష్ణారెడ్డి, నల్లధల కృష్ణారావు, రమణారెడ్డి బ్రహ్మయ్య, సిఐటియు నాయకులు టి.రాము తదితరులు పాల్గొన్నారు.

## మహానాడును విజయవంతం చేయాలి



**సాలూరు, పతాకం న్యూస్:** టీడీపీ ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. సాలూరులోని కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, పార్టీశ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహానాడు పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి కోరారు. శనివారం సాలూరులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లో భాగంగా పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. బైక్ నడిపి మంత్రి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పొదుపు చర్యల్లో భాగంగా కారు విని యోగాన్ని తగ్గించాలని సూచించారు. ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించారు. చెత్తను నిర్థిష్ట ప్రదేశాల్లో వేయాలని, ప్రజలకు సూచించా రు. స్వచ్ఛమైన పట్టణాల నిర్మాణమే లక్ష్యమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కాళ్ల శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ రత్నకుమార్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్ తగిలి వృద్ధురాలు మృతి

**సాలూరు, పతాకం న్యూస్:** స్థానిక నాజరుపేటలో సోమవారం ఉదయం విషాద ఘటన జరిగింది. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో విద్యుత్ షాక్ కు గురై సయ్యద్ ప్యారి జాన్ (68) అనే వృద్ధ మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. వీచిన ఈదురుగాలుల కారణంగా ఘటనా స్థలంలో విద్యుత్ సర్వీస్ వైర్ జారి వేలాడుతున్నట్లు సమాచారం. నేలరాలిన కొబ్బరి బోండాలను సేకరించే క్రమంలో సర్వీస్ వైరు తాకి ఈ ప్రమాదం జరిగినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. ఘటనపై పూర్తి సమాచారం విచారణలో తెలియాల్సి ఉందన్నారు. ఇదిలా ఉండగా మృతురాలి కుటుంబ సభ్యులు వివరాలు తెలిపేందుకు నిరాకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలి




**సామర్లకోట, పతాకం న్యూస్:** విద్యుత్ కోతలు నివారించాలని కోరుతూ .... సిపిఎం సామర్లకోట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బాలం శ్రీనివాస్ మాట్లాడుతూ .... ఎండలు ఉక్కపోత ఓవైపు ... విద్యుత్ కోతలు మరో వైపు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని అసహనాన్ని వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా ఎండలు 40 -- 42 డిగ్రీలు నమోదు అవుతున్నాయని, ప్రజలు విశ్రాంతి తీసుకునే రాత్రి సమయంలో అప్రకటిత కరెంట్ కోతల వలన ప్రజానీకం నిద్రకు దూరం అవుతున్నారని తక్షణమే కోతలు లేకుండా నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంప్లైంట్ సెంటర్ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని దానికి సిబ్బంది కేటాయించాలని, పాడైన ట్రాన్స్ఫార్మర్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతూ ... ఎలక్ట్రికల్ ఈ ఈ కి వినతిపత్రం ఇచ్చారు.

## మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సుడిగాలి పర్యటన



**నంద్యాల, పతాకం న్యూస్:** బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. బనగానపల్లెలో మైనార్టీల కోసం నూతనంగా నిర్మిస్తున్న షాదీ ఖానా నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అతి త్వరలో షాదీ ఖానాను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అవుకుమెట్ట ప్రాంతంలో రహదారి విస్తరణ పనులను పరిశీలించి.. వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. బనగానపల్లె పట్టణంలోని పాత ఎమ్మార్వో(ప్రస్తుత ఆర్డీవో) కార్యాలయం పునరుద్ధరణ పనులను పరిశీలించి.. అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. 1బనగానపల్లెలోని కొండపేట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనులను మంత్రి పర్యవేక్షించారు. అలాగే బనగానపల్లె బైపాస్ నిర్మాణ పనులను పరిశీలించారు. 2026 డిసెంబర్ నాటికి బనగానపల్లె ప్రజలకు బైపాస్‌ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి బీసీ జనార్దన్ ఆదేశాలు జారీ చేశారు.

# రాత్రి నిద్రపోయినా, పగటిపూట అలసిపోతున్నారా?



ఆలోచనలు సక్రమంగా సాగాలన్నా, ఆరోగ్యం ఇనుమడించాలన్నా నిద్ర చాలా కీలకం. రోజంతా పనుల్లో పడి అలసిపోయిన శరీరానికి రాత్రి నిద్ర కొత్త శక్తి అందేలా చేస్తుంది. అయితే, కొంత మంది రాత్రిపూట నిద్రపోయినప్పటికీ పగటిపూట అలసటగా ఉంటారు. నిద్ర ముంచుకొస్తున్నట్లుగా ఉంటారు. మరి, ఈ పరిస్థితి కారణాలేంటి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అన్నది ఇప్పుడు తెలుసుకుందాం. కొంత మంది రాత్రివేళ కావాల్సినంత నిద్రపోతారు. దాదాపు 9 నుంచి 11 గంటలు పడుకుంటారు. అయినప్పటికీ పగటి పూట నిద్రమత్తుగా ఉంటుంది. ఈ పరిస్థితి వల్ల ఉదయం మేల్కోవడానికి చాలా ఇబ్బంది పడుతుంటారు. లేచిన తర్వాత కూడా చాలా మత్తుగా ఉంటారు. ఇంకా.. గందరగోళంగా ఉంటారు. చురుకుగా ఉండరు. ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొనేవారిలో కొన్ని సమస్యలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వాటిలో ప్రధానమైన నాలుగు అంశాల గురించి వివరిస్తున్నారు. రాత్రిపూట పూర్తి విశ్రాంతి తీసుకున్నప్పటికీ మరుసటి రోజు అలసిపోయినట్లు అనిపించడానికి స్లీప్ అప్నియా కారణం కావచ్చంటున్నారు నిపుణులు. ఈ సమస్య ఉన్నవారికి నిద్రలో శ్వాస తీసుకోవడంలో ఆటంకాలు ఎదురవుతాయని చెబుతున్నారు. దానివల్ల కంటిన్యూగా గాఢనిద్రపోయే అవకాశం ఉండదని చెబుతున్నారు. మగత నిద్రపోతుంటారట. ఫలితంగా, పగటిపూట అలసటతో ఉన్నట్లు అనిపిస్తుందట. దీంతోపాటు నార్కోలెప్సీ, హైపర్సోమ్నియా వంటి నిద్ర రోగాలు కూడా పగటిపూట అలసటగా ఉండడానికి కారణమవుతాయని అధ్యయనం పేర్కొంది. పగటిపూట నిద్ర సమస్యకు పోషకాహార లోపం కూడా ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. ఐరన్, విటమిన్ డి, విటమిన్ బి12 వంటి ముఖ్యమైన పోషకాలు లోపిస్తే దేహంలో శక్తి తగ్గిపోతుందంటున్నారు. ఐరన్ లోపం ఉంటే, రాత్రిపూట 8 గంటలకుపైగా నిద్రపోయినా కూడా పగటిపూట నిద్ర వస్తున్నట్లు అనిపిస్తుందట. ఇంకా అలసటగా అనిపిస్తుందట. అయితే, విటమిన్ డి, బి12 లోపాలు దేహంలో శక్తి ఉత్పత్తిని ప్రభావితం చేస్తాయని పేర్కొంటున్నారు. దీంతో రోజంతా నీరసంగా ఉంటారని చెబుతున్నారు. మానసిక ఒత్తిడి లేదా సమస్యలు కూడా శారీరక అలసటకు కారణమవుతాయంటున్నారు నిపుణులు. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల శరీరం ఎక్కువ శక్తి వినియోగించుకుంటుందని చెబుతున్నారు. దీంతో పడుకునేటప్పుడు కూడా మెదడుకు విశ్రాంతి ఉండదని అంటున్నారు. ఇలాంటి సమస్యలు ఎదుర్కొనేవారు ఒత్తిడిని అదుపులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకోసం ధ్యానం, యోగా, వాకింగ్, స్విమ్మింగ్ లాంటివి చేయాలని సూచిస్తున్నారు. పగటిపూట అలసటకు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా కారణం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. డై టైమ్‌లో నిద్ర రావడానికి థైరాయిడ్ సమస్య ఒక సంకేతం కావచ్చని అధ్యయనం పేర్కొంది. థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోవడం వల్ల శరీరం శక్తిని ఉపయోగించుకునే విధానం మందగిస్తుందని అంటున్నారు. అలాగే మధుమేహం, క్రానిక్ ఫెటీగ్ సిండ్రోమ్ (దీర్ఘకాలిక అలసట) వంటి అంతర్లీన వైద్య పరిస్థితులు కూడా అలసటకు కారణం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు సరిగా నిర్వహించలేకపోతే కూడా శరీరం అలసటగా ఉన్నట్లు అనిపిస్తుందని వివరిస్తున్నారు. ఇలాంటి లక్షణాలు ఏవైనా కనిపిస్తే వైద్య నిపుణులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రతిరోజూ వేర్వేరు సమయాల్లో పడుకోవడం, మేల్కొనడం వల్ల సర్కాడియన్ రిథమ్ దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే, రోజూ ఒకే సమయానికి పడుకోవటం, లేవటం చాలా ప్రధానం అంటున్నారు. ఒకవేళ రాత్రి ఆలస్యంగా పడుకున్నా కూడా ఉదయం రోజూవారీ సమయానికి లేవాలని సూచిస్తున్నారు. అలాగే, వారాంతాల్లో కూడా ప్రతిరోజూ ఒకే సమయంలో మేల్కొని నిద్రపోవడం అలవాటు చేసుకోవాలని అధ్యయనం పేర్కొంది. పడుకునే ముందు ఎక్కువ భోజనం చేయడం లేదా అధిక ద్రవాలు తీసుకోవడం వల్ల అసౌకర్యం కలుగుతుందంటున్నారు నిపుణులు. అలాగే, నిద్రకు అంతరాయం కలుగుతుందని చెబుతున్నారు. అందుకే, నిద్రకు ఉపక్రమించే కొన్ని గంటల ముందు భోజనం చేయడం, సాయంత్రం వేళల్లో తక్కువ ద్రవాలు తీసుకోవడం మంచిదని అధ్యయనం పేర్కొంది. అలాగే, సమతులాహారం కూడా తప్పకుండా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆల్కహాల్, కెఫిన్ నిద్ర నాణ్యతను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయంటున్నారు నిపుణులు. అందువల్ల నిద్రకు ఉపశమించే గంట ముందు మద్యం సేవించడం, మధ్యాహ్నం 3 గంటల తర్వాత కెఫిన్ తీసుకోవడం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. నిద్రపోయే గదిలో మసక చీకటి ఉండేలా చూసుకోవాలంటున్నారు నిపుణులు. నిద్రకు ఉపక్రమించటానికి ముందు నుంచే ఇంట్లో వెలుతురు తక్కువగా ఉండేలా చూసుకుంటే ఇంకా మంచిదని సలహా ఇస్తున్నారు. అలాగే, నిద్రపోయే సమయానికి గంట ముందు సెల్‌ఫోన్లు, టీవీలు, ల్యాప్‌టాప్ లాంటి వాటి జోలికి వెళ్లకుండా చూసుకోవాలని చెబుతున్నారు.

# పనిలో ముందు ... కూలి రేట్లలో వెనుకబాటు

## ఉపాధి కార్మికుల దుస్థితి..



**విజయనగరం, పతాకం న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి పనుల్లో విజయనగరం జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. కూలిరేటులో మాత్రం 20వ స్థానానికి పరిమితమైంది. జిల్లాలో రోజుకు సగటున 2.43 లక్షల మంది కార్మికులు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి (ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు) 2.36 లక్షల కుటుంబాలకు చెందిన 3.12 లక్షల మంది కార్మికులు హాజరైనట్టుగా అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విషయంలో విజయనగరం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినప్పటికీ, రూ.307 సాధారణ వేతనానికి గాను కేవలం రూ.260 మాత్రమే కార్మికులకు దక్కుతోంది.

మార్కాపురం, ప్రకాశం, శ్రీకాకుళం, నెల్లూరు, కర్నూలు, బాపట్ల, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో అంతకన్నా తక్కువ వేతనాలు అందుతున్నాయి. పనులు చేయడంలో వెనుకబడి ఉన్న 19 జిల్లాల్లో విజయనగరం కన్నా మెరుగైన వేతనాలు అందుతున్నాయి. ముఖ్యంగా విజయనగరం జిల్లాకు ఆనుకుని ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.300, కోనసీమలో రూ.297, పోలవరం జిల్లాలో రూ.296 చొప్పున సగటు వేతనాలు అందుతుండడం గమనార్హం.

సాగునీటి వనరులు లేకపోవడం వల్ల వ్యవసాయ పనులు తగ్గిపోవడం, పారిశ్రామికంగానూ జిల్లా వెనుకబడి ఉండడం వంటి కారణాలతో చదువుకున్న యువత సైతం ఉపాధి పనులబాట పట్టింది. దీంతో, విజయనగరం జిల్లాలో లక్షలాది కుటుంబాలు కేవలం ఉపాధి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఈ క్రమంలో తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయడం లేదు. వేడి తట్టుకోలేక ఈ నెల 12న గజపతినగరం మండలం గంగచోళ్లపెంటకు చెందిన గుదే సత్యం (60) మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 30న వేపాడ మండలం సోంపురంలోని టేకుమానుచెరువులో పని ప్రాంతంలో కొటాన రాములమ్మ మరణించించారు. మరో నలుగురు కార్మికులు కూడా వడదెబ్బకు గురై మరణించారు. ఉపాధి హామీ అధికారిక కూలి రేటు రోజుకు సుమారు రూ.307గా ఉన్నప్పటికీ, కార్మికుల చేతికి వచ్చే సగటు వేతనం మాత్రం జిల్లాల వారీగా వ్యత్యాసం కనిపిస్తోంది. విజయనగరం జిల్లాలో సగటు వేతనం రూ.260 వస్తున్నట్టు అధికారులు లెక్కలు కట్టినప్పటికీ, మే నెలలో అందింది రూ.258 మాత్రమే. ఇంతకన్నా తక్కువ వేతనం అందుకుంటున్నవారు కూడా అక్కడక్కడ ఉన్నారని సమాచారం. శ్రమకు తగ్గట్టుగా కూలిరేట్లు పెంచకపోవడం, పనుల కొలతల విధానంలో లోపం ఇందుకు మూల కారణాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తిస్థాయిలో జరగలేదనే పేరుతో తమకు పూర్తి వేతనం చెల్లించడం లేదని చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి హామీకి నిధులు, పనిదినాలు, కూలి పెంచాలని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తున్నాయి.

"గత రెండు నెలల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 6 గంటల వరకు ఉపాధి పనులు చేస్తున్నామని, కానీ, రూ.200 మంచి కూలీ రావడం లేదని తీవ్రమైన ఎండలో మట్టిపని చేయడం చాలా కష్టతరమని.. పని ప్రదేశాల్లో కనీసం నీరు, నీడ వంటి సదుపాయాలు కూడా లేవని" ఉపాధి కార్మికులు వాపోతున్నారు.

# ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



**అమరావతి, పతాకం న్యూస్:** ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయి. రాష్ట్రమంతా భానుడి భగభగలకు మండిపోతుంటే మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బాపట్ల జిల్లాలో తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి కొన్ని ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. భారీగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బాపట్ల జిల్లాలోని అమృతలూరులో ఈదురు గాలులతో కూడిన ఆకాల వర్షం బీభత్సం సృష్టించింది. దాంతో గ్రామదేవత ఆలయ ప్రాంగణంలోని వేపచెట్టు ఈదురు గాలులకు విరిగిపోయి విద్యుత్తు లైన్లు, తెనాలి చెరుకుపల్లి అర్అం డ్ బీ రోడ్డుపై పడింది. మూడు స్తంభాలు నేలమట్టమయ్యాయి. విద్యుత్ తీగలు సైతం తెగిపోయాయి. ఫలితంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్టు, విద్యుత్తు స్తంభాలు రోడ్డుపై అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థులు వాహనాలను విద్యుత్తు శాఖ సిబ్బంది వేరే మార్గంలో మళ్లించారు. రహదారిపై అడ్డుగా పడిన విద్యుత్తు లైన్లు, స్తంభాలు, చెట్టును తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఫలితంగా గ్రామంలో అంధకారం నెలకొంది. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన పరిస్థితిపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయి అధికారులతో ఫోన్?లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. గాలుల తీవ్రతకు చెట్లు, డిస్‌ప్లే హోర్డింగ్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతోనే సరఫరా నిలిచిపోయిందని అధికారులు మంత్రికి వివరించారు.ఎక్కడికక్కడ లైన్లను క్లియర్ చేస్తూ పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు.వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా, సిబ్బంది భద్రతను చూసుకుంటూ పనులు ముగించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి వీలైనంత త్వరగా అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ అధికారులకు స్పష్టం చేశారు.




# కేఎల్ రాహుల్ అద్భుతమైన ఆటగాడు: అంబటి రాయుడు!



ఢిల్లీ క్యాపిటల్స్ వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌పై భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసల వర్షం కురిపించాడు. ఐపీఎల్‌లో రాహుల్ ఏ జట్టుకు ఆడినా అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడని కొనియాడాడు. ఈ సీజన్‌లో అద్భుతంగా రాణించిన రాహుల్.. ఐపీఎల్ ట్రోఫీ గెలవడానికి పూర్తి అర్హుడని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో కేఎల్ రాహుల్ బ్యాట్‌తో దుమ్మురేపాడు. ఈ సీజన్‌లో ఆడిన 14 మ్యాచ్‌ల్లో 174.41 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 593 పరుగులు చేశాడు. ఇందులో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో కేవలం 30 బంతుల్లోనే 60 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచాడు. అయితే రాహుల్ ఇంత బాగా రాణించినా, ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు పాయింట్ల పట్టికలో ఆరో స్థానంతోనే సరిపెట్టుకుంది. కోల్‌కతా స్పిన్నర్ సునీల్ నరైన్ బౌలింగ్‌ను ఈ సీజన్‌లో రాహుల్ ఎదుర్కొన్నంత ధైర్యంగా ఎవరూ ఎదుర్కోలేదని రాయుడు అన్నాడు. నరైన్ బౌలింగ్‌లో రాహుల్ కొట్టిన స్ట్రెయిట్ షాట్లు ఈ సీజన్‌లోనే అత్యుత్తమమైనవని చెప్పాడు. ఐపీఎల్‌లో హేజిల్‌వుడ్, నరైన్ లాంటి పెద్ద పెద్ద బౌలర్లను టార్గెట్ చేయడం రాహుల్‌కు అలవాటని, ఢిల్లీ మేనేజ్‌మెంట్ అతడికి ఒక విన్నింగ్ టీమ్‌ను అందించి ట్రోఫీ గెలిపించాలని కోరాడు. ముంబై ఇండియన్స్ మాజీ హెడ్ కోచ్ మార్క్ బౌచర్ కూడా రాహుల్ బ్యాటింగ్‌ను మెచ్చుకున్నాడు. కోల్‌కతా స్పిన్ ద్వయం నరైన్, వరుణ్ చక్రవర్తిలను మిడిల్ ఓవర్లలో రాహుల్ సమర్థంగా ఎదుర్కొని ఢిల్లీకి మంచి ఊపునిచ్చాడన్నాడు. పవర్‌ప్లే తర్వాత మిగతా జట్లను వణికించిన కోల్‌కతా స్పిన్నర్లపై రాహుల్ ఎదురుదాడికి దిగి వారి ప్రభావాన్ని తగ్గించాడని విశ్లేషించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరకపోవడంపై రాయుడు అసంతృప్తి వ్యక్తం చేశాడు. మిచెల్ స్టార్క్, లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ లాంటి అనుభవజ్ఞులైన బౌలర్లు, డేవిడ్ మిల్లర్, కేఎల్ రాహుల్ లాంటి మ్యాచ్ విన్నర్లు ఉన్న ఢిల్లీ జట్టు టాప్-2లో ఉండాల్సిందని అభిప్రాయపడ్డాడు.

## జోఫ్రా ఆర్చర్ ఆల్‌రౌండ్ షో..

# ప్లేఆఫ్స్‌కు చేరిన రాజస్థాన్ రాయల్స్



ముంబై: చావోరేవో మ్యాచ్‌లో జోఫ్రా ఆర్చర్ (32, 3/17) ఆల్‌రౌండ్ షోతోపాటు మిగతా బౌలర్లు రాణించడంతో.. రాజస్థాన్ రాయల్స్ ప్లేఆఫ్స్ బెర్త్‌ను సొంతం చేసుకొంది. ఐపీఎల్‌లో తమ ఆఖరి మ్యాచ్‌లో రాజస్థాన్ 30 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. దీంతో 16 పాయింట్లతో ప్లేఆఫ్స్ నాలుగో బెర్త్‌ను ఖరారు చేసుకోగా.. గతేడాది రన్నరప్ పంజాబ్ కింగ్స్ (15 పాయింట్లు), కోల్‌కతాల కథ ముగిసింది. బుధవారం జరిగే ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో రాజస్థాన్ అమీతుమీ తేల్చుకోనుంది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 205/8 స్కోరు చేసింది. ధ్రువ్ జురెల్ (38), షనక (29) ఫర్వాలేదనిపించారు. ఛేదనలో ముంబై ఓవర్లన్నీ ఆడి 175/9 స్కోరు మాత్రమే చేసి ఓడింది. సూర్య(60), హార్దిక్ పాండ్యా (34), విల్ జాక్స్ (33) పోరాడినా ఫలితం దక్కలేదు. బ్రిజేష్ శర్మ, బర్గర్, యశ్‌రాజ్ తలో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. ఆర్చర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఛేదనలో ఆర్చర్ దెబ్బకు ముంబై 38/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. రోహిత్ శర్మ (0), నమన్ ధీర్ (6)ను ఆర్చర్ పెవిలియన్ చేర్చాడు. రికెల్టన్ (12)ను బర్గర్, తిలక్‌వర్మ (3)ను బ్రిజేష్ వెనక్కిపంపాడు. ఈ దశలో జాక్స్‌తో కలసి ఐదో వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన సూర్య.. పాండ్యాతో కలసి ఆరో వికెట్‌కు 58 రన్స్ జోడించి ఆశలు రేపాడు. అయితే, జాక్స్, బాష్ (2) వికెట్లను యశ్ దక్కించుకోగా.. హార్దిక్‌ను ఆర్చర్ పెవిలియన్ చేర్చాడు. సూర్యను బర్గర్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపడంతో ముంబై ఓటమి లాంఛనమే అయింది. చివరి 2ఓవర్లలో ముంబై విజయానికి 40 రన్స్ కావాల్సిఉండగా.. శార్దూల్ (10నాటౌట్), చాహర్ (8), ఘజన్‌ఫర్ చేతులెత్తేశారు. టాపార్డర్ నిరాశపర్చినా..చివర్లో ఆర్చర్, జడేజా (19 నాటౌట్) బ్యాట్‌లు ఝుళిపించడంతో రాజస్థాన్ పోరాడగలిగే స్కోరు చేసింది. వీరిద్దరి దెబ్బకు ముంబై చివరి 5 ఓవర్లలో 73 రన్స్ సమర్పించుకొంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్‌కు జైస్వాల్ (27), వైభవ్ (4) తొలి వికెట్‌కు 33 పరుగులు జోడించారు. జైస్వాల్‌ను జాక్స్.. వైభవ్‌ను చాహర్ అవుట్ చేశారు. కెప్టెన్ రియాన్ పరాగ్ (14) విఫలమైనా.. జురెల్, షనక నాలుగో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, దూకుడుగా ఆడుతున్న షనక రనౌట్ కాగా.. జురెల్‌ను బాష్ బౌల్డ్ చేశాడు. 16వ ఓవర్‌లో ఫెరీరా (18)ను చాహర్ వెనక్కిపంపడంతో రాజస్థాన్ 139/6తో స్వల్ప స్కోరుకే పరిమితమవుతుందా? అని అనిపించింది. కానీ, ఈ దశలో ఆర్చర్ ముంబై బౌలర్లపై అనూహ్యంగా ఎదురుదాడికి దిగడంతో స్కోరు వేగం పుంజుకొంది. శుభం దూబే (5)తో కలసి ఆర్చర్ ఏడో వికెట్‌కు 14 బంతుల్లోనే 35 పరుగులు జోడించాడు. 18వ ఓవర్‌లో దూబే, ఆర్చర్‌ను శార్దూల్ అవుట్ చేసినా.. 9వ నెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగిన జడేజా, బర్గర్ (10 నాటౌట్) తొమ్మిదో వికెట్‌కు వేగంగా 30 రన్స్ జోడించడంతో.. రాజస్థాన్ స్కోరు అనూహ్యంగా 200 మార్క్ దాటింది.




# వారణాసి... హైదరాబాదులో మహేష్ బాబుపై పాట చిత్రీకరణ!



సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న వారణాసి చిత్రంపై ఓ ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలకమైన పాటను హైదరాబాద్‌లోని కాటేదాన్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఇది కేవలం ఓ సాధారణ డ్యాన్స్ నంబర్ కాదని, కథను ముందుకు నడిపించే ముఖ్యమైన పాట అని తెలుస్తోంది. ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్ షూటింగ్‌ను ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని రాజమౌళి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పలు ప్రధాన షెడ్యూల్స్‌ను పూర్తి చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో నీటి కొరత కారణంగా, ముందుగా ప్లాన్ చేసుకున్న ఓ అండర్‌వాటర్ సీక్వెన్స్‌ను కూడా విజయవంతంగా చిత్రీకరించారు.

ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా మందాకిని పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' అనే సాహస యాత్రికుడిగా కనిపించనుండగా, ఓ ప్రత్యేక ఘట్టంలో శ్రీరాముడి పాత్రలోనూ కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది. విలన్‌గా పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' పాత్రలో నటిస్తున్నారు.

ఈ భారీ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అయితే, ఈ షూటింగ్ వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది.

## జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న

# 'జన నాయగన్'



తమిళ అగ్ర నటుడు, ఇళయ దళపతి విజయ్ నటించిన 'జన నాయగన్' సినిమా విడుదలకు మార్గం సుగమమైంది. ఆయన తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో, ఈ సినిమా రిలీజ్‌కు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. ఈ నేపథ్యంలో సినిమా కొత్త విడుదల తేదీపై ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలోకి రానుంది.

తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. జూన్ 22న విజయ్ పుట్టినరోజు కావడంతో దానికి కానుకగా మూడు రోజుల ముందే సినిమాను తీసుకురావాలని భావిస్తున్నారట. ఇప్పటికే కొన్ని ఆన్‌లైన్ టికెటింగ్ యాప్స్‌లో విడుదల తేదీగా జూన్ 19ని పేర్కొనడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. అయితే, దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ఇదిలా ఉంటే.. ఈ సినిమా తెలుగులో నందమూరి బాలకృష్ణ నటించిన సూపర్ హిట్ చిత్రం 'భగవంత్ కేసరి'కి రీమేక్ అనే ప్రచారం ఉంది. హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటించగా, మమితా బైజు ఓ కీలక పాత్రలో కనిపించనుంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించింది.




# రౌడీ జనార్ధనలో ప్రీతీ ముకుందన్



రౌడీ హీరో విజయ్ దేవరకొండ ఒక మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్న విషయం తెల్సిందే. ప్రస్తుతం విజయ్ ఆశలన్నీ రౌడీ జనార్ధన మీదనే పెట్టుకున్నాడు. రవికిరణ్ కోలా దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రంలో విజయ్ సరసన కీర్తి సురేష్ (ఖవవతీష్ట్రం ాబతీవంష్ట్ర) నటిస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ సినిమాకు సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.సినిమా ఫెస్టివల్ సమాచారం

రౌడీ హీరో సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చాలా తక్కువ. కానీ, ఇప్పుడు ప్రతి సినిమాలో హీరోయిన్ తో ఐటెంసాంగ్ చేయించడం ట్రెండ్ గా మారిన విషయం తెల్సిందే. దీంతో విజయ్ కూడా ఆ ట్రెండ్ ని ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. రౌడీ జనార్ధనలో ఒక ఐటెంసాంగ్ ఉండనుందంట. దానికోసం కన్నప్ప బ్యూటీని రంగంలోకి దించినట్లు సమాచారం. అందాల భామ ప్రీతీ ముకుందన్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆసా కూడా అనే ప్రైవేట్ ఆల్బమ్ తో బాగా ఫేమస్ అయిన ప్రీతీ కన్నప్ప సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. ఇక రౌడీ జనార్ధనలో ప్రీతీ ఐటెంసాంగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో.. ఊర మాస్ బీట్ ని విజయ్, ప్రీతీల మీద చిత్రీకరించాలని చూస్తున్నారట. అయితే.. ప్రీతీ మొదటి నుంచి డ్యాన్సర్. కానీ, విజయ్ కి డ్యాన్స్ కి చాలా దూరం. డియర్ కామ్రేడ్ సినిమాకు విజయ్ చాలా కష్టపడి డ్యాన్స్ వేశాడు. ఇప్పుడు ఐటెంసాంగ్ అందులో మాస్ బీట్ అంటే.. చాలా కష్టమని కొందరు అంటున్నారు. ఒకవేళ విజయ్ కష్టమైన మాస్ స్టెప్స్ వేయగలిగితే ఈ సాంగ్ కి తిరుగు ఉండదు అని.. విజయ్ మాస్ స్టెప్స్, ప్రీతీ అందం రెండు కలిస్తే సినిమా బ్లాక్ బస్టరే అని ఫ్యాన్స్ చెప్పుకొస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**